Follow: @ANNTELUGU
16-09-2026
ANN తెలుగు
# మహా పత్రిక
బుధవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 237 పేజీలు-08 వెల-రూ.1
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## 22ఏ భూములపై సీఎం రేవంత్ క్లారిటీ

- నేడు అసెంబ్లీలో చర్చ.. మంత్రులతో సీఎం సమాలోచన
- నిజమైన భూ యజమానులు, కొనుగోలుదారులకు
- ఇబ్బందులు లేకుండా పరిష్కారాలపై దృష్టి
- నిషేధిత జాబితాపై ప్రభుత్వం స్పష్టతకు సిద్ధం

**హైదరాబాద్, మహా :** 22ఏ నిషేధిత భూముల వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం కీలక కసరత్తు చేస్తోంది. బుధవారం శాసన సభలో ఈ అంశంపై చర్చ జరగనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందుబాటులో ఉన్న మంత్రులతో హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీలో సమావేశమయ్యారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల కారణంగా నిజమైన భూ యజమానులు, కొనుగోలుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వాటికి పరిష్కారం చూపే మార్గాలతో పాటు ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సమావేశంలో చర్చించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మిగితా 3వ పేజీలో

టాప్ న్యూస్



### యూపీఐకి కేంద్రం షాక్

- రూ.2,000 వరకు వ్యాపారి చెల్లింపులకు ఛార్జీలు లేవు
- ఆపై వాటికి.. బాదుడు

03



### యూపీఐ ఛార్జీలపై రాహుల్ ఫైర్

- మోదీ మళ్లీ రాజీపడ్డారు
- అమెరికా ఒత్తిడికి లొంగిపోయారు
- వినియోగదారులపైనే ఛార్జీల భారం

02



యూపీఐపై ఛార్జీలు విధిస్తే

### భారత్‌లో మళ్లీ క్యాష్ జమానా

- యూపీఐపై ఛార్జీలను వ్యతిరేకించిన అష్నీర్ గ్రోవర్
- లావాదేవీల విలువలో 66 శాతం పెద్ద ట్రాన్సాక్షన్సే

02

## రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం



పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం సంతృప్తికరం

**బూత్ స్థాయి వరకు కాంగ్రెస్ బలోపేతం**

కులసర్వేతో తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం

సీఎం రేవంత్‌రెడ్డితో మంచి వేవ్ లెంగ్త్ కుదిరింది

మా జోడీ సూపర్ హిట్.. దేశంలోనే అగ్రస్థానంలో తెలంగాణ పీసీసీ

వచ్చే ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుండే పోటీచేస్తా

మీడియాతో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చిట్ చాట్

**రేవంత్‌తో కలిసి రాహుల్ కోసం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలోపేతం చేయడంతో పాటు జాతీయ స్థాయిలో పార్టీకి మరింత బలం చేకూర్చడమే తమ ముందున్న లక్ష్యమని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడానికి తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీకి గట్టి మద్దతు అందేలా పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రంలో పార్టీకి ఉన్న సంస్థాగత బలాన్ని మరింత పెంచి వచ్చే రాజకీయ పోరాటాలకు కార్యకర్తలను సిద్ధం చేస్తామని వెల్లడించారు.

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగిందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎలాంటి గ్యాప్ లేదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో తనకు మంచి వేవ్‌లెంగ్త్ కుదిరిందని తెలిపారు. పార్టీ వ్యవహారాల్లో తామంతా సమన్వయంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమన్వయంతో ముందుకు సాగుతూ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు రాహుల్‌గాంధీని దేశ ప్రధానిగా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. టీపీసీసీ చీఫ్ గా రెండేళ్ళు పూర్తిచేసుకున్న నేపథ్యంలో మీడియాతో మంగళవారం చిట్ చాట్ నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీని కేవలం రాష్ట్ర స్థాయిలోనే కాకుండా గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లోనూ బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టామని మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. ముఖ్యంగా బూత్ స్థాయిలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేస్తూ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేసినట్లు తెలిపారు. కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని, వారి సహకారంతో పార్టీని ప్రజలకు మరింత చేరువ చేయగలిగామని పేర్కొన్నారు.

**కులసర్వేతో సామాజిక న్యాయం**

తెలంగాణలో నిర్వహించిన కులసర్వేను మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రస్తావిస్తూ.. సామాజిక వాస్తవాలను గణాంకాల రూపంలో వెలుగులోకి తీసుకురావడంలో ఇది కీలకమైన అడుగు అని అన్నారు. సమాజంలోని వివిధ వర్గాల జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం అందుబాటులోకి రావడం ద్వారా మిగతా 2వ పేజీలో



## అక్రమ నిర్మాణాలకు ఎమ్మెల్యే అండదండలా..?

**కాగితాలకే పరిమితమైన ఎస్‌టీఎఫ్ నియామకం..!**

**డెమాలిషన్ ఆదేశాలు బుట్టదాఖలా..!?**

- నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్న వైనం..!
- ఖానామెట్ ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34లో ఆగని అక్రమ నిర్మాణాలు..!
- నిద్రమత్తులో మాదాపూర్ డిప్యూటీ కమిషనర్..!
- జోనల్ కమిషనర్ ఆదేశాలకు లెక్కలేదా..?
- డివిజన్ల పర్యటనలకే పరిమితమైన సిఎంసీ కమిషనర్..!
- ప్రభుత్వ భూముల పరిరక్షణ హైడ్రాకు పట్టింపు లేదా..?
- చేతులెత్తేసిన అధికార యంత్రాంగం..!

02

ప్రజల మాన, ప్రాణాలతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు బద్ధులై ఉంటామని అసెంబ్లీ సాక్షిగా ప్రమాణం చేసిన నియోజకవర్గ ఎమ్మెల్యే ఆ ప్రమాణాలను గాలి కొదిలేసి భూ కబ్జాధారులు, అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి .. అందులో భాగంగా నియోజకవర్గంలోని ఖానామెట్ ప్రభుత్వ సర్వే నంబర్లు 11/33, 11/34 లలో వందలాది అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నపటికీ.. ఎమ్మెల్యే పేరు చెప్పి కొందరు అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలు సాగిస్తున్నారని స్థానికులు పేర్కొనడం వాస్తవ పరిస్థితులను బట్టి తేటతెల్లమవుతోంది .. అందువల్లనే అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన టౌన్ ప్లానింగ్ అధికారులకు సదరు ఎమ్మెల్యే అనుచరులు అల్టిమేటం జారీ చేయడంతోనే అధికార యంత్రాంగం అటువైపు వెళ్లేందుకు సాహసించడం లేదనే ఆరోపణలు బహిరంగానే వ్యక్తమవుతున్నాయి.. ఇదిలా ఉంటే సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపేందుకు నియమించిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ కాగితాలకే పరిమితమైందని.. ఖానామెట్లో ప్రభుత్వ భూమిలో నిర్మించిన సెల్లార్‌తో పాటు ఏడంతస్తుల అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలని నెల క్రితం ఎస్‌టీఎఫ్‌కు జారీ చేసిన స్పీకింగ్ ఆర్డర్స్ ఏమయ్యాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు..కూల్చివేతలు అమలు చేయాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. వాటిని అమలు చేయాల్సిన మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ నిద్రమత్తు వీడటం లేదని, అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు వెళ్లేందుకు స్థానిక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లకు జంకుతున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..ప్రభుత్వ భూముల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రాకు పట్టింపు లేదా..? అని వారు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణదారులకు ఎమ్మెల్యే అండదండలు ఉండటంతోనే అధికార యంత్రాంగం చేతులెత్తేసిందనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

### బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు అభినందనల వెల్లువ

03

### విజయవాడలో పెరిగిన డివిజన్లు..

03

## దానం ఔట్ !

- దానం నాగేందర్ అనర్హతపై నేడు తీర్పు.
- మధ్యాహ్నం 3.45 గంటలకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిర్ణయం.
- కౌశిక్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి పిటిషన్లపై గత నెలలో వాదనలు పూర్తి.. తీర్పు రిజర్వ్

**హైదరాబాద్, మహా:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హతకు సంబంధించిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ నేడు తీర్పు వెలువరించనుంది. మధ్యాహ్నం 3.45 గంటలకు తీర్పు వెల్లడించనున్నట్లు న్యాయస్థానం నిర్ణయించింది. దానం నాగేందర్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాగా దానంపై అనర్హత వేటు ఖాయమన్న చర్చ రాజకీయవర్గాల్లో ఉంది. మిగతా 2వ పేజీలో



### టీజీటెట్–ఇన్‌సర్వీస్ టీచర్స్–2026 కీ విడుదల

- సెప్టెంబరు 8, 9న జరిగిన పరీక్షలకు ప్రాథమిక కీ అందుబాటులోకి
- కీపై అభ్యంతరాలకు 17వ తేదీ వరకు అవకాశం

02

### శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- రాష్ట్రం సుభిక్షంగా, దేశం అగ్రగామిగా నిలవాలని శ్రీవారిని ప్రార్థించినట్లు వెల్లడి
- కుటుంబ సమేతంగా బ్రహ్మోత్సవ వేడుకల్లో పాల్గొన్న బాబు

03



### మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత

- గుండెపోటుతో తుదిశ్వాస.
- ఏలూరులో విషాద ఛాయలు.

02



### తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌చార్జ్

- చెల్లకుమార్ పేరు పరిశీలనలో!
- మీనాక్షి నటరాజన్ స్థానంలో మార్పు
- ఉన్నత చదువుల కోసం లండన్‌కు పయనం
- రెండు, మూడు రాష్ట్రాలకూ కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లు
- ఐదారు రాష్ట్రాల్లో కొత్త పీసీసీ అధ్యక్షులపై కసరత్తు

03



# అక్రమ నిర్మాణాలకు ఎమ్మెల్యే అండదండలా..?

**మహా, బ్యూరో చీఫ్, హైదరాబాద్:** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని శేరిలింగంపల్లి మండలం, కూకట్‌పల్లి జోన్, హైటెక్‌సిటీ-కూకట్‌పల్లి ప్రధాన రహదారి పక్కన, బుట్టా కన్వెన్షన్ ఆనుకుని ఉన్న ఖానామెట్ సర్వే నంబర్లు 11/33, 11/34లోని రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణదారుల పాలైందని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 4 వేల చదరపు గజాల సర్కారు స్థలంలో బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతుండటం తీవ్ర కలకలం రేపుతోంది. స్వయంగా సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన నెల క్రితమే స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్)కు కూల్చివేత (డెమాలిషన్) ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ఆ దిశగా అడుగులు వేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.అధికారుల పర్యవేక్షణ లోపం, క్షేత్రస్థాయి సిబ్బంది ఉదాసీనతను ఆసరాగా చేసుకుని ఆక్రమణదారులు రాత్రింబవళ్లు నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే 7 అంతస్థుల నిర్మాణం పూర్తికాగా.. ఏకంగా 8వ అంతస్తు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని పేర్కొంటున్నారు. అధికారులు కేవలం కాగితాలపైనే నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప.. రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు కనీస చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.



### అక్రమ నిర్మాణాలకు ఎమ్మెల్యే అండదండలా..?

ఖానామెట్ పరిధిలోని అత్యంత విలువైన ప్రభుత్వ సర్వే నంబర్లలో జరుగుతున్న భారీ అక్రమ నిర్మాణాల వెనుక శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అండదండలు ఉన్నాయంటూ స్థానికంగా, రాజకీయ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ఎమ్మెల్యే పేరును తెరపైకి తెచ్చి ఆయనను బద్నాం చేసేందుకు కొందరు కుట్ర పన్నుతున్నారనే చర్చ కూడా సాగుతోంది. అక్రమార్కులు తమ స్వార్థం కోసం ఎమ్మెల్యే పేరును వాడుకుంటూ ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ వెంటనే స్పందించాల్సిన అవసరం ఉందని, తనపై వస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ, ప్రభుత్వ ప్రతిష్టను కాపాడేందుకు స్వయంగా రంగంలోకి దిగి, అక్రమ నిర్మాణాల కూల్చివేతల్లో ఎమ్మెల్యే ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని, అధికారులను అప్రమత్తం చేసి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని నియోజకవర్గ ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### కాగితాలకే పరిమితమైన ఎస్‌టీఎఫ్ నియామకం..!

అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు, బృహత్తర ఆశయంతో ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) నియామకం కేవలం కాగితాలకే పరిమితమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి . అక్రమ నిర్మాణాలను గుర్తించడం, క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించడం, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకోవడం ఎస్‌టీఎఫ్ ప్రధాన బాధ్యత అయినప్పటికీ.. ఖానామెట్ వ్యవహారంలో మాత్రం ఆ స్థాయిలో చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్వయంగా సిఎంసీ కమిషనర్ స్థాయి అధికారి నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయినప్పటికీ.. క్షేత్రస్థాయిలో ఎస్‌టీఎఫ్ బృందాల తనిఖీలు గానీ, ఆక్రమణలపై తీసుకున్న చర్యలు గానీ కనిపించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ భూమిలో బహుళ అంతస్తుల నిర్మాణం జరుగుతున్న విషయం అధికారుల దృష్టికి వచ్చినా.. నిర్మాణ పనులను నిలిపివేయడంలో, నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న పనులపై కఠిన చర్యలు తీసుకోవడంలో ఎస్‌టీఎఫ్ విఫలమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.. ఇప్పటికే 7 అంతస్తుల నిర్మాణం పూర్తయి, 8 వ అంతస్తు నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నప్పటికీ.. ఎస్‌టీఎఫ్ జోక్యం చేసుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన ఉద్దేశమేంటని, ఉన్నతాధికారుల ఆదేశాలు అమలు కాకపోతే ఈ వ్యవస్థ ఎందుకని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నవైనం..!

కంటితుడుపు చర్యగా అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి తమ బాధ్యత తీరిపోయిందన్నట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నోటీసుల గడువు ముగిసినా.. నిర్మాణాలు 7 వ అంతస్తు దాటి 8 వ అంతస్తుకు చేరుకుంటున్నా పట్టించుకోకపోవడం అధికారుల ఉదాసీనతకు అద్దం పడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.
కేవలం కాగితాలపై చర్యలు చూపుతూ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. నోటీసులు ఇవ్వడం మాత్రమే కాకుండా.. నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారో స్పష్టం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### జోనల్ కమిషనర్ ఆదేశాలకు లెక్కలేదా..?

అక్రమ నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని, వెంటనే కూల్చివేతలు చేపట్టాలని జోనల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. వాటిని కిందిస్థాయి సిబ్బంది, డీసీ స్థాయిలో పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల నుండి ఆదేశాలు జారీ అయినప్పటికీ వాటిని క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడం అధికార యంత్రాంగంలోని సమన్వయ లోపాలను ఎత్తిచూపుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.కమిషనర్ స్థాయి నుంచి వచ్చిన ఆదేశాలకే క్షేత్రస్థాయిలో విలువ లేకపోతే.. ప్రభుత్వ ఆస్తులను ఎలా పరిరక్షిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకుని ఉన్నతాధికారుల ఆదేశాలను అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### డివిజన్ల పర్యటనలకే పరిమితమైన సీఎంసీ కమిషనర్..!

ఇదిలా ఉంటే సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన కేవలం డివిజన్ల పర్యటనలు, సమీక్షా సమావేశాలకే పరిమితమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్వయంగా కూల్చివేత ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. క్షేత్రస్థాయిలో అవి ఎందుకు అమలు కావడం లేదనే విషయంపై ఆరా తీయకపోవడం, పర్యవేక్షణ లోపించడం వల్లే అక్రమ నిర్మాణదారులు మరింత రెచ్చిపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ఉన్నతాధికారి ఆదేశాల తర్వాత కూడా అక్రమ నిర్మాణం కొనసాగుతున్న పరిస్థితిపై ప్రత్యేకంగా దృష్టి సారించి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆదేశాలు జారీ చేయడమే కాకుండా వాటి అమలు జరిగేలా పర్యవేక్షణ ఉండాలని వారు పేర్కొంటున్నారు.
ప్రభుత్వ భూముల పరిరక్షణ హైడ్రాకు పట్టింపు లేదా..?
చెరువులు, ప్రభుత్వ భూముల సంరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెబుతున్న హైడ్రాకు కూడా బుట్టా కన్వెన్షన్ పక్కన జరుగుతున్న ఈ భారీ అక్రమ నిర్మాణాలు కనిపించకపోవడం విడ్డూరంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. నగరం నడిబొడ్డున, హైటెక్‌సిటీ కూకట్పల్లి ప్రధాన రహదారి పక్కనే రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతోందన్న ఆరోపణలు వస్తున్నా హైడ్రా ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు.ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధిత విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సి ఉండగా.. ఒక శాఖ నుంచి మరో శాఖకు బాధ్యతలు బదిలీ చేయడం వల్ల అక్రమ నిర్మాణదారులకు లాభం చేకూరుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను నిగ్గు తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

### డెమాలిషన్ ఆదేశాలు బుట్టదాఖలా..!

ఖానామెట్‌లోని అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేయాలని నెల క్రితమే సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన స్పష్టమైన డెమాలిషన్ (కూల్చివేత) ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ఉన్నతాధికారి ఇచ్చిన ఆదేశాలు కాగితాలకే పరిమితమై బుట్టదాఖలయ్యాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఒక్క ఇటుక కూడా కదల్చకపోవడం, నిర్మాణ పనులను నిలిపివేయకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాత కూడా కూల్చివేత చర్యలు ఎందుకు చేపట్టడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆదేశాలు జారీ చేసిన అధికారులు.. వాటి అమలు పరిస్థితిని పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.

### చేతులెత్తేసిన అధికార యంత్రాంగం..!

ఖానామెట్‌లో రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడటంలో మున్సిపల్, రెవెన్యూ యంత్రాంగం, హైడ్రా పూర్తిగా విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు ఎస్‌టీఎఫ్, మరోవైపు నోటీసులు, ఇంకోవైపు కూల్చివేత ఆదేశాలు ఉన్నప్పటికీ.. అక్రమ నిర్మాణాలు మాత్రం ఆగకపోవడం అధికార యంత్రాంగం పనితీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది.ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి 8 వ అంతస్తుకు చేరుకున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడంతో పాటు అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారిపై, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.మరోవైపు తన నియోజకవర్గంలో ప్రభుత్వ భూమిలో ఇంత భారీగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నా.. తనపై వస్తున్న ఆరోపణలపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పందించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తనకు అక్రమ నిర్మాణదారులతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేయడంతో పాటు.. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అధికారులతో మాట్లాడి అక్రమ నిర్మాణాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ వ్యవహారంపై ఎమ్మెల్యే స్వయంగా స్పందించి అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ముందుకు వస్తే.. తనపై వస్తున్న ఆరోపణలకు, తన పేరుతో జరుగుతున్న ప్రచారానికి తెరపడటంతో పాటు ప్రజల్లో నెలకొన్న అనుమానాలు కూడా నివృత్తి అవుతాయని స్థానికులు పేర్కొంటున్నారు.

### నిద్రమత్తులో మాదాపూర్ డిప్యూటీ కమిషనర్..!

సిఎంసీ కి కూతవేటు దూరంలో ప్రధాన రహదారి పక్కనే కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిలో ప్రధాన రోడ్డును సైతం ఆక్రమించి యదేచ్ఛగా సెల్లార్ తో పాటు 8 వ అంతస్తు వరకు నిర్మాణం కొనసాగుతున్నా.. మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ స్థాయిలో ఆశించిన చర్యలు కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు, సామాజిక కార్యకర్తలు వరుసగా ఫిర్యాదులు చేస్తున్నా.. పై అధికారుల నుంచి ఆదేశాలు వచ్చినా డీసీ స్థాయిలో చర్యలు తీసుకోవడానికి వెనుకంజ వేయడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన క్షేత్రస్థాయి అధికారులు ప్రేక్షక పాత్ర వహించడం వల్లే నిర్మాణదారులు మరింత రెచ్చిపోయి వేగంగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

























# యూపీఐపై ఛార్జీలు విధిస్తే భారత్‌లో మళ్లీ క్యాష్ జమానా

**ముంబై, మహా :** యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే ఆలోచనపై 'భారత్‌పే' సహ వ్యవస్థాపకుడు అష్నీర్ గ్రోవర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూపీఐ సేవలకు రుసుము వసూలు చేస్తే అది పరోక్షంగా పన్ను విధించినట్లేనని వ్యాఖ్యానించారు. ఇప్పటికే విజయవంతంగా పనిచేస్తున్న వ్యవస్థలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు వస్తే ప్రజలు, వ్యాపారులు మళ్లీ నగదు వైపు మళ్లే అవకాశం ఉందని గ్రోవర్ హెచ్చరించారు. దీనివల్ల బ్యాంకులు, వ్యాపార సంస్థలకు నగదు నిర్వహణ ఖర్చులు పెరుగుతాయని చెప్పారు. చివరికి భారత్ మళ్లీ నగదు ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారే పరిస్థితి రావచ్చన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. రూ.2,000 వరకు యూపీఐ లావాదేవీలపై బ్యాంకులు, చెల్లింపు సంస్థలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎలాంటి ఛార్జీలు విధించకూడదు. రూపే డెబిట్ కార్డు చెల్లింపులకూ ఇదే నిబంధన వర్తిస్తుంది. అయితే రూ.2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై, ముఖ్యంగా వ్యాపారుల చెల్లింపుల విషయంలో ఛార్జీలు విధించే అవకాశం ఉందా అన్నది నోటిఫికేషన్‌లో స్పష్టంగా లేదు. ప్రస్తుతం లావాదేవీ విలువతో సంబంధం లేకుండా యూపీఐపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) లేదు. అయితే రూ.2,000 పరిమితి ఎందుకు పెట్టారన్నదే తన ప్రశ్న అని గ్రోవర్ అన్నారు. రూ.2,000 కంటే ఎక్కువ లావాదేవీలు మొత్తం లావాదేవీల్లో పరిమాణం పరంగా కేవలం 4 శాతమే అయినా.. మొత్తం విలువలో వాటి వాటా 66 శాతంగా ఉందని పేర్కొన్నారు. పెద్ద మొత్తాల యూపీఐ చెల్లింపులపై ఎండీఆర్ విధిస్తే ఆ భారాన్ని వ్యాపారులు వినియోగదారులపై మోపే అవకాశం ఉందని గ్రోవర్ చెప్పారు. లేదంటే ఒకేసారి రూ.12,000 చెల్లించాల్సిన చోట రూ.2,000 చొప్పున పలుమార్లు చెల్లించే పరిస్థితి రావచ్చన్నారు. అదే సమయంలో దుకాణదారులు రూ.2,000 కంటే ఎక్కువ యూపీఐ చెల్లింపులను స్వీకరించకుండా నగదు అడిగే అవకాశం ఉందని చెప్పారు. అప్పుడు నగదు అవసరం పెరుగుతుంది. మరిన్ని ఏటీఎంలు, నగదు నిర్వహణ కేంద్రాలు అవసరమవుతాయని తెలిపారు. యూపీఐపై ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీ వల్ల అసలు ఎవరికి నష్టం జరుగుతోందో చెప్పాలని గ్రోవర్ ప్రశ్నించారు. రిజర్వ్ బ్యాంక్ నుంచి ప్రభుత్వానికి రూ.2.87 లక్షల కోట్ల మిగులు బదిలీ జరిగిందని, లిస్టెడ్ బ్యాంకుల మొత్తం లాభాలు రూ.4.11 లక్షల కోట్లుగా ఉన్నాయని గుర్తుచేశారు. ఎన్‌పీసీఐ ప్రీట్యాక్స్ మిగులు కూడా రూ.1,888 కోట్లుగా ఉందని పేర్కొన్నారు.

# దానం ఔట్ !

( మొదటి పేజీ తరువాయి )
ఇప్పటికే పిటిషన్లపై ఇరుపక్షాల వాదనలను హైకోర్టు డివిజన్ బెంచ్ గత నెలలో పూర్తిగా విన్నది. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటించాలని కోరగా, ప్రతివాదుల తరఫు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు పూర్తయిన అనంతరం ధర్మాసనం తీర్పును రిజర్వ్ చేసింది.

**ఉప ఎన్నిక ఖాయం**

దానం నాగేందర్ అనర్హత వ్యవహారంపై బుధవారం తీర్పు రానుండగా, తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తీర్పులో న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం వెలువరిస్తుందన్న దానిపై రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే హైకోర్టు అనర్హత వేటువేస్తుందన్న ధీమా బీఆర్ఎస్ వర్గాల్లో ఉంది. ఉప ఎన్నిక ఖాయమన్న ధీమాలో ఆ పార్టీ నేతలు ఉన్నారు. అప్పీల్ కు వెళ్ళినా నెలరోజుల్లోపే క్లియర్ అవుతుందన్న అంచనాలో పార్టీ వర్గాలున్నాయి

# రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యం

( మొదటి పేజీ తరువాయి )
విధాన నిర్ణయాలకు ఆధారం ఏర్పడుతుందని తెలిపారు. కులసర్వే ద్వారా తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయానికి పునాది పడిందని ఆయన పేర్కొన్నారు.

**రెండేళ్ల ప్రయాణంపై సంతృప్తి**

పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల కాలం ఎంతో ఉత్సాహంగా, అనేక అనుభవాలతో సాగిందని మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తల సహకారంతో సంస్థాగతంగా కాంగ్రెస్ మరింత బలోపేతమైందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీ శ్రేణులను నిరంతరం ప్రజలతో అనుసంధానించడం ద్వారా కాంగ్రెస్ పునాదులను మరింత పటిష్ఠం చేశామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంతో పాటు పార్టీని ప్రతి స్థాయిలో బలోపేతం చేయడమే తమ బాధ్యత అని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బలాన్ని జాతీయ రాజకీయాలకు అనుకూలంగా మలచి, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే తమ అంతిమ రాజకీయ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తా**

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా నుండే తాను పోటీచేస్తానని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ తెలిపారు. 40 ఏండ్ల తర్వాత తనకు ఎమ్మెల్సీ పదవి దక్కిందని, పార్టీలో సహనం అవసరమన్నారు. పనిచేయని డీసీసీలపై ఏఐసీసీ ఎప్పటికపుడు సర్వే చేస్తున్నదని, తెలంగాణలో 14 డీసీసీలు ఏకేటగిరీలో ఉన్నాయన్నారు. డీసీసీలకు పీసీసీ ఎన్నికల కమిటీలో ఆయా జిల్లాల ప్రతిపాదన సమయంలో సభ్యులుగా ఉంటారన్నారు. కొండా సురేఖ తొలగింపు అంశంలో తాము బాధపడ్డామని, కేబినెట్ లో కనీసం నలుగురు బీసీలు ఉండాలన్నది తమ కోరిక అన్నారు. తనకు మంత్రి పదవిపై ఆశలేదని, వచ్చే ఎన్నికల్లో రేవంత్ నాయకత్వంలో గెలిస్తే మరోసారి సీఎంగా రేవంత్ కే అవకాశం ఉంటుందని, బీసీ సీఎం అనే కల ఎప్పటికైనా కేవలం కాంగ్రెస్ పార్టీలో మాత్రమే సాధ్యమన్నారు.

# మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని కన్నుమూత

- గుండెపోటుతో తుదిశ్వాస
- ఏలూరులో విషాద ఛాయలు

**విశాఖపట్నం, మహా.** ఆంధ్రప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (ఆళ్ల నాని) కన్నుమూశారు. 57 ఏళ్ల వయసులో గుండెపోటుతో మంగళవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. విశాఖపట్నంలోని సీతమ్మధారలో తన నివాసంలో ఉన్న సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. ఆళ్ల నాని మృతితో ఏలూరు సహా ఉభయ గోదావరి జిల్లాల్లో విషాదం నెలకొంది. ఆయనకు వివిధ రాజకీయ పార్టీల నేతలు, అభిమానులు, కార్యకర్తలు నివాళులర్పిస్తున్నారు. కాపు సామాజిక వర్గానికి, ఉభయ గోదావరి జిల్లాల రాజకీయాలకు ఆయన మరణం తీరని లోటని పలువురు పేర్కొన్నారు.

**ఏలూరు నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా**

ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ 1969 డిసెంబరు 30న ఏలూరులో జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆయన 2004, 2009 ఎన్నికల్లో ఏలూరు నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి 2019 ఎన్నికల్లో మరోసారి ఏలూరు నుంచి శాసనసభకు ఎన్నికయ్యారు. 2017లో శాసనమండలి సభ్యుడిగా కూడా పనిచేశారు.

**వైఎస్ జగన్ మంత్రివర్గంలో కీలక బాధ్యతలు**

వైఎస్ రాజశేఖరరెడ్డి మరణానంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆళ్ల నాని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం 2019లో ఆయన మంత్రివర్గంలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి సమయంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖను ముందుండి నడిపిన నేతల్లో ఆళ్ల నాని ఒకరుగా నిలిచారు.
రాజకీయాలకు దూరం.. టీడీపీలో చేరిక
2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం ఆళ్ల నాని క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. 2024 ఆగస్టు 9న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, క్రియాశీల రాజకీయాలకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం 2025 ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

**చంద్రబాబు, జగన్ దిగ్భ్రాంతి**

ఆళ్ల నాని మృతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆళ్ల నాని చిన్న వయసులోనే గుండెపోటుతో కన్నుమూయడం బాధాకరమని చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆళ్ల నాని మరణవార్తతో ఏలూరు రాజకీయ వర్గాల్లో విషాదం అలుముకుంది. ప్రత్యర్థి పార్టీల నేతలు సైతం ఆయనతో ఉన్న రాజకీయ, వ్యక్తిగత అనుబంధాలను గుర్తుచేసుకుంటూ సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధిగా, మంత్రిగా ఆయన అందించిన సేవలను పలువురు స్మరించుకుంటున్నారు.

# యూపీఐ ఛార్జీలపై రాహుల్ ఫైర్

- మోదీ మళ్లీ రాజీపడ్డారు
- అమెరికా ఒత్తిడికి లొంగిపోయారు
- వినియోగదారులపైనే ఛార్జీల భారం

**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా విస్తృతంగా వినియోగిస్తున్న యూపీఐ చెల్లింపులపై కేంద్రం తాజాగా జారీ చేసిన నోటిఫికేషన్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఈ లావాదేవీలపై చార్జీలు విధించేందుకు మార్గం సుగమం చేస్తోందంటూ లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. రూ.2 వేలకుపైబడిన వ్యాపారి యూపీఐ లావాదేవీల పై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అవకాశం కల్పించడం ద్వారా జీరో చార్జీ విధానాన్ని నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని అమెరికా చెల్లింపు సంస్థల ఒత్తిడితో ముడిపెట్టిన ఆయన, ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి అమెరికా ఒత్తిడికి లొంగిపోయారని ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధించేందుకు ప్రభుత్వం నిశ్శబ్దంగా మార్గం సుగమం చేస్తోంది. రూ.2 వేలకుపైబడిన వ్యాపార సంబంధిత యూపీఐ లావాదేవీలపై భవిష్యత్తులో ఎండీఆర్ విధించే అవకాశం ఉంది. యూపీఐ లావాదేవీల పరిమాణంలో రూ.2వేలకు పైబడిన చెల్లింపులు కేవలం ఐదు మాత్రమే ఉన్నాయి. అయితే విలువ పరంగా చూస్తే ఇవే దాదాపు 65 శాతం వరకు ఉంటాయి. వినియోగదారుల నుండి ఎలాంటి ఫీజులు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. కానీ కస్టమర్ల నుంచి నేరుగా ఎలాంటి యూపీఐ ఫీజు వసూలు చేయబోమని ప్రభుత్వం చెబుతోంది. అయితే దుకాణదారులపై విధించే చార్జీలను ఎవరు భరిస్తారు? అవి వస్తువుల ధరల్లోకి చేరి చివరకు వినియోగదారుల జేబు నుంచే బయటకు వస్తాయి' అని రాహుల్ గాంధీ అన్నారు.




# బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ కు అభినందనల వెల్లువ

**పీసీసీ చీఫ్ గా రెండేళ్ళు పూర్తి**

**హైదరాబాద్, మహా :** పీసీసీ చీఫ్ గా రెండేళ్ళు పూర్తిచేసుకున్న మహేష్ కుమార్ గౌడ్ కు అభినందనలు వెల్లువెత్తాయి. గాంధీభవన్ లో మహేష్ గౌడ్ కు అభినందనలు తెలిపేందుకు నేతలు క్యూ కట్టారు. శాలువాలు, పూలదండలతో.. ఘనంగా సత్కరించారు. తమ నేత రెండేళ్ళ పదవీకాలం పూర్తిచేసుకోవడంపై నేతలు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



# 22ఏ భూములపై సీఎం రేవంత్ క్లారిటీ

( మొదటి పేజీ తరువాయి )

శ్రీధర్ బాబు, వివేక్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**అసెంబ్లీ చర్చకు ముందే సమాలోచన**

22ఏ భూముల అంశం రాష్ట్రంలో రాజకీయంగానూ, ప్రజాపరంగానూ ప్రాధాన్యం సంతరించుకున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి మంత్రులతో ప్రత్యేకంగా చర్చించడం ప్రాధాన్యం సంతరించుకుంది. శాసనసభలో ప్రభుత్వం తరపున ఈ అంశంపై సమగ్రంగా వివరణ ఇచ్చేందుకు అవసరమైన సమాచారాన్ని సీఎం సమీక్షిస్తున్నట్లు తెలుస్తోంది. నిషేధిత భూముల జాబితా రూపకల్పన, దాని వల్ల ఏర్పడిన సమస్యలు, ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలిస్తున్న పరిష్కార మార్గాలపై మంత్రుల అభిప్రాయాలను రేవంత్‌రెడ్డి తెలుసుకున్నారు.

**జమైన యజమానులకు వెసులుబాటుపై దృష్టి**

22ఏ జాబితాలో భూమి ఉండటంతో చట్టబద్ధంగా హక్కులు కలిగి ఉన్నవారు సైతం విక్రయం, కొనుగోలు, రిజిస్ట్రేషన్ వంటి వ్యవహారాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే ఫిర్యాదులు ప్రభుత్వం దృష్టికి వచ్చినట్లు తెలుస్తోంది. అటువంటి సందర్భాల్లో అసలు భూ హక్కుదారులను గుర్తించడం, తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన భూములను పరిశీలించడం, అర్హులైన వారికి న్యాయం జరిగేలా విధానం రూపొందించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించారు. 22ఏ సమస్యకు మూల కారణాలపై కూడా ముఖ్యమంత్రి శాసనసభలో వివరించే అవకాశం ఉందని తెలుస్తోంది. గతంలో భూముల కేటాయింపులు, హక్కుల బదలాయింపులు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల్లో జరిగిన మార్పులు తదితర అంశాలను సభ ముందుంచే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో భూ వ్యవహారాల్లో చోటుచేసుకున్న పరిణామాలను కూడా ప్రస్తావిస్తూ ప్రస్తుత పరి



స్థితికి దారితీసిన కారణాలను వివరించాలని సీఎం భావిస్తున్నారు..

**ప్రతిపక్షాల విమర్శలకు సమాధానం**

22ఏ అంశంపై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలకు సభా వేదికగా సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. నిషేధిత భూముల సమస్యను కేవలం రాజకీయ అంశంగా కాకుండా ప్రజల భూ హక్కులు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ రికార్డుల ప్రక్షాళనకు సంబంధించిన అంశంగా ప్రభుత్వం వివరించే అవకాశం ఉంది. గతంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రభావం, ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న చర్యలను విడివిడిగా వివరించాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు.

**భూభారతి వ్యవస్థపైనా చర్చ**

22ఏ జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో భూ రికార్డుల ప్రక్షాళన, క్షేత్రస్థాయి పరిశీలన, సంబంధిత శాఖల సమన్వయం కీలకంగా మారనున్నాయి. భూ రికార్డులను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం తీసుకొస్తున్న చర్యలతో ఈ సమస్యను అనుసంధానించే అంశంపైనా చర్చ జరిగే అవకాశం ఉంది. తప్పులు ఉంటే సరిదిద్దడం, అనర్హమైన నమోదులను తొలగించడం, చట్టబద్ధమైన హక్కులను రక్షించడం వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టనున్నట్లు తెలుస్తోంది. బుధవారం అసెంబ్లీలో 22ఏ అంశంపై జరిగే చర్చలో ప్రభుత్వం ఎలాంటి విధానాన్ని ప్రకటిస్తుంది? నిషేధిత జాబితాలో ఉన్న భూములపై ఎలాంటి పరిష్కార మార్గాన్ని సూచిస్తుంది? నిజమైన భూ యజమానులు, కొనుగోలుదారులకు ఎలాంటి వెసులుబాటు కల్పిస్తుంది? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది. ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిష్కారం చూపడంతోపాటు, ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించేలా సమతుల్య విధానాన్ని రూపొందించడమే ప్రభుత్వ ముందున్న ప్రధాన సవాలుగా మారింది. సభలో ముఖ్యమంత్రి ఇచ్చే వివరణతో 22ఏ భూముల వ్యవహారంపై ప్రభుత్వ వైఖరిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## టీజీటెట్–ఇన్‌సర్వీస్ టీచర్స్–2026 కీ విడుదల

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026కు సంబంధించిన ప్రాథమిక కీ విడుదలైంది. సెప్టెంబరు 8, 9 తేదీల్లో నిర్వహించిన టీజీటెట్-ఇన్‌సర్వీస్ టీచర్స్-2026 పరీక్షలకు సంబంధించిన కీని పాఠశాల విద్యాశాఖ అందుబాటులోకి తీసుకొచ్చింది. అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ లో సంబంధిత లింక్ ద్వారా కీని పరిశీలించుకోవచ్చు.అభ్యంతరాలకు అవకాశం విడుదల చేసిన ప్రాథమిక కీలో ఏదైనా ప్రశ్నకు సంబంధించి సమాధానం తప్పుగా ఉన్నట్లు భావించే అభ్యర్థులు అభ్యంతరాలను నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. నేటి నుంచి ఈ నెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను సమర్పించవచ్చు. అధికారిక లింక్ ద్వారానే.. అభ్యర్థులు పాఠశాల విద్యాశాఖ అధికారిక వెబ్‌సైట్ లోని సంబంధిత లింక్‌ను ఉపయోగించి తమ అభ్యంతరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గడువు ముగిసిన తర్వాత వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉండదు. అందువల్ల అభ్యర్థులు గడువులోగా కీని పరిశీలించి, అవసరమైతే ఆధారాలతో అభ్యంతరాలను సమర్పించాలని అధికారులు సూచించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది కీని విడుదల చేసే అవకాశం ఉంది. తుది కీ ఆధారంగానే పరీక్ష ఫలితాల ప్రక్రియ ముందుకు సాగనుంది.

# యూపీఐకి కేంద్రం షాక్

- రూ.2,000 వరకు వ్యాపారి చెల్లింపులకు ఛార్జీలు లేవు
- ఆపై వాటికి.. బాదుడు

**ఢిల్లీ, మహా:** యూపీఐ లావాదేవీలకు సంబంధించి కొత్త నిబంధనలపై కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. వ్యక్తుల మధ్య జరిగే పర్సన్ టు పర్సన్ లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే ఉంటాయని తెలిపింది. స్నేహితులు, కుటుంబ సభ్యులకు ఎంత మొత్తాన్ని పంపినా ఎలాంటి లావాదేవీ ఛార్జీలు, దాచిన రుసుములు ఉండవని స్పష్టం చేసినట్లు సమాచారం. యూపీఐ ద్వారా ఒక వ్యక్తి మరో వ్యక్తికి నగదు పంపే లావాదేవీలపై ఎలాంటి పరిమితి ఆధారిత ఛార్జీలు ఉండవని ప్రభుత్వం పేర్కొంది. కుటుంబ సభ్యులు, స్నేహితులకు డబ్బు పంపే సందర్భంలో వినియోగదారుల నుంచి లావాదేవీ రుసుము వసూలు చేయరాదని స్పష్టం చేసింది. దీంతో సాధారణ వినియోగదారులు యూపీఐని గతంలో మాదిరిగానే ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. వ్యాపార సంస్థలకు చేసే పర్సన్ టు మర్చంట్ చెల్లింపుల్లో రూ.2,000 వరకు ఎండీఆర్ రుసుము ఉండదని నిబంధనలు పేర్కొంటున్నాయి. అలాగే యూపీఐ క్యూఆర్ ద్వారా నెలకు రూ.లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వీధి వ్యాపారులకు కూడా సున్నా ఎండీఆర్ మినహాయింపు వర్తిస్తుందని పేర్కొంది.

**రూ.2,000 దాటితే ఎండీఆర్**

రూ.2,000 కంటే ఎక్కువ విలువ కలిగిన సాధారణ వ్యాపారి లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వర్తించే విధానం ఉంటుందని వివరించింది. ఈ రుసుముకు గరిష్ఠంగా రూ.300 వరకు పరిమితి ఉంటుందని పేర్కొంది. అయితే రైల్వేలు, పెట్రోల్, బీమా వంటి ప్రత్యేక రంగాల్లో రూ.2,000కు మించిన లావాదేవీలకు శాతం ఆధారిత ఎండీఆర్ కాకుండా రూ.5 స్థిర రుసుము విధించే విధానం ఉంటుందని తెలిపింది.

**భారం వినియోగదారుడిపై వేయొద్దు**

యూపీఐ లావాదేవీలకు సంబంధించిన వ్యాపారి రుసుమును వినియోగదారులపైకి మళ్లించకుండా బ్యాంకులు, సంబంధిత సంస్థలు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు సమాచారం. యాప్ ప్రొవైడర్లు అదనపు ప్లాట్‌ఫామ్ ఫీజుల పేరుతో వినియోగదారులపై భారం మోపకూడదని కూడా పేర్కొంది. యూపీఐ దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకంగా మారిన నేపథ్యంలో.. చిన్న మొత్తాల లావాదేవీలపై అదనపు భారం లేకుండా చూడటం ద్వారా డిజిటల్ చెల్లింపుల వినియోగాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న వ్యాపారులు, వీధి వ్యాపారులకు సున్నా ఎండీఆర్ మినహాయింపులు డిజిటల్ చెల్లింపులను స్వీకరించేందుకు మరింత ప్రోత్సాహం కల్పించనున్నాయి.

# తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇన్‌చార్జ్



**హైదరాబాద్, మహా:** భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు పదును పెట్టే దిశగా కాంగ్రెస్ అధిష్ఠానం సంస్థాగత మార్పులపై దృష్టి సారించింది. తెలంగాణతో పాటు మరో రెండు, మూడు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లను నియమించే అంశంపై కసరత్తు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అదే సమయంలో ఐదారు రాష్ట్రాలకు కొత్త పీసీసీ అధ్యక్షులను నియమించే అంశంపైనా అధిష్ఠానం సమాలోచనలు చేస్తున్నట్లు సమాచారం.

**తెలంగాణపై ప్రత్యేక దృష్టి**

తెలంగాణ ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా ప్రస్తుతం వ్యవహరిస్తున్న మీనాక్షి నటరాజన్ స్థానంలో మార్పు చేయనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆమె ఉన్నత చదువుల కోసం ఈ నెల 18 నుంచి లండన్ వెళ్లనున్న నేపథ్యంలో ఈ మార్పుపై చర్చ మొదలైనట్లు తెలుస్తోంది. సుమారు పది నెలల పాటు క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉండనున్న నేపథ్యంలో తెలంగాణకు కొత్త ఇన్‌చార్జ్‌ను నియమించే అంశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

**చెల్లకుమార్ పేరు పరిశీలనలో**

తెలంగాణకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌గా ఎ. చెల్లకుమార్ పేరును కాంగ్రెస్ అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే తుది నిర్ణయం ఇంకా వెలువడాల్సి ఉంది. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ప్రభుత్వ-పార్టీ సమన్వయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్త ఇన్‌చార్జ్‌ను ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

**పలు రాష్ట్రాల్లో సంస్థాగత మార్పులు**

వచ్చే రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పలు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సిద్ధమవుతున్నట్లు సమాచారం. రెండు, మూడు రాష్ట్రాలకు కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జ్‌లతో పాటు ఐదారు రాష్ట్రాలకు కొత్త పీసీసీ అధ్యక్షులను నియమించే ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌కు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ప్రభుత్వంతో సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం వంటి అంశాలు కీలకంగా మారిన నేపథ్యంలో కొత్త ఇన్‌చార్జ్ నియామకంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అయితే చెల్లకుమార్ నియామకంపై అధికారిక ప్రకటన వెలువడే వరకు దీనిని పరిశీలనలో ఉన్న పేరుగానే చూడాల్సి ఉంటుంది.

# విజయవాడలో పెరిగిన డివిజన్లు.. 64 నుంచి 86కు

**విజయవాడ, మహా:** విజయవాడ నగరపాలక సంస్థలో డివిజన్ల సంఖ్య పెరిగింది. ఇప్పటివరకు ఉన్న 64 డివిజన్లను 86కు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తుది గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో నగరంలో మరో 22 డివిజన్లు అందుబాటులోకి వచ్చాయి. రానున్న పురపాలక ఎన్నికలు కొత్త డివిజన్ల పునర్విభజన ప్రకారమే జరగనున్నాయి. ఈ నిర్ణయంతో ఇప్పటికే ఎన్నికల బరిలో దిగేందుకు సిద్ధమవుతున్న ఆశావహుల్లో రాజకీయ సందడి మొదలైంది.

**జనాభా ప్రాతిపదికగా పునర్విభజన**

డివిజన్ల పునర్విభజనకు జనాభా, పరిపాలనా సౌలభ్యం ప్రధాన ప్రాతిపదికగా ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొంటోంది. ఒకే డివిజన్‌లో అధిక జనాభా, ఓటర్ల సంఖ్య ఉండటంతో ప్రజలకు స్థానిక పాలన మరింత చేరువ కావాలన్న ఉద్దేశంతో డివిజన్ల సంఖ్య పెంచినట్లు తెలుస్తోంది. విజయవాడ జనాభా గత జనగణనతో పోలిస్తే గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత విభజనలో మార్పులు అవసరమయ్యాయని అధికారులు భావించారు.

**అభ్యంతరాలు.. తుది నోటిఫికేషన్**

డివిజన్ల పునర్విభజన ప్రక్రియలో భాగంగా ప్రతిపాదనలు రూపొందించి, అభ్యంతరాలకు అవకాశం కల్పించిన అనంతరం తుది ప్రతిపాదనలను ఖరారు చేశారు. అనంతరం ప్రభుత్వం తుది గెజిట్ విడుదల చేసింది. డివిజన్ల పెంపుపై న్యాయపరమైన అంశాలు కూడా చర్చకు వచ్చినప్పటికీ.. ప్రక్రియ ముందుకు సాగింది.

రాష్ట్రంలోని ఇతర నగరాల్లోనూ పెంపు

డివిజన్ల పునర్విభజన విజయవాడకే పరిమితం కాలేదు. రాష్ట్రంలోని పలు ప్రధాన నగరపాలక సంస్థల్లోనూ డివిజన్ల సంఖ్యను పెంచారు. గ్రేటర్ విశాఖపట్నం నగరపాలక సంస్థలో 98 నుంచి 120కు, గుంటూరులో 57 నుంచి 76కు, నెల్లూరులో 54 నుంచి 72కు డివిజన్ల సంఖ్య పెంచినట్లు సమాచారం. కర్నూలులో 52 నుంచి 68కు, తిరుపతి, కడపలో 50 నుంచి 66కు, ఏలూరు, అనంతపురం, ఒంగోలు, విజయనగరంలో 50 నుంచి 62కు పెంచారు.

**ఎన్నికలకు కొత్త రాజకీయ లెక్కలు**

విజయవాడలో 22 కొత్త డివిజన్లు ఏర్పడటంతో రాజకీయ సమీకరణాల్లోనూ మార్పులు వచ్చే అవకాశం ఉంది. కొత్త డివిజన్లలో పోటీ చేసేందుకు అధికార కూటమితో పాటు ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆశావహులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేసే అవకాశం ఉంది. డివిజన్ల పునర్విభజన తర్వాత రిజర్వేషన్ల ఖరారు కీలకంగా మారనుంది. ఏ డివిజన్ ఏ వర్గానికి రిజర్వు అవుతుందన్న దానిపై ఆశావహుల రాజకీయ భవిష్యత్తు ఆధారపడనుంది.

**ప్రత్యేకాధికారి పాలన నుంచి ఎన్నికల వైపు**

విజయవాడ నగరపాలక సంస్థకు గత పాలకవర్గం పదవీకాలం ముగిసిన అనంతరం ప్రత్యేకాధికారి పాలన కొనసాగుతోంది. ఇప్పుడు డివిజన్ల పునర్విభజన పూర్తవడంతో ఎన్నికల ప్రక్రియకు మరో కీలక అడుగు ముందుకు పడినట్లయింది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల సంఘం తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

# శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

**తిరుపతి, మహా :** తిరుమలలోని క్రమశిక్షణతో కూడిన, పారదర్శకమైన ఆలయ నిర్వహణ దేశంలోని ఇతర దేవాలయాలకు ఒక స్ఫూర్తి అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించే ఈ పవిత్ర కార్యం తన అదృష్టమని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సమేతంగా తిరుమల చేరుకున్న చంద్రబాబు, తొలుత బేడీ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, మంగళ వాయిద్యాల నడుమ పట్టువస్త్రాలను శిరస్సుపై ఉంచుకుని శ్రీవారి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి వస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత, ఆలయ పండితులు ముఖ్యమంత్రికి, ఆయన కుటుంబ సభ్యులకు వేదాశీర్వచనాలు అందించగా, అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు కురిసి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ దేవదేవుడిని ప్రార్థించాను. ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా, భారత్ ప్రపంచంలో అగ్రగామిగా నిలవాలని కోరుకున్నాను" అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది హిందువులకు కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిపై అపారమైన విశ్వాసం ఉందని చంద్రబాబు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక్కసారైనా శ్రీవారిని దర్శించుకోవాలని కోరుకుంటారని.. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఆలయాన్ని చక్కగా నిర్వహిస్తున్న టీటీడీ పాలకమండలిని, అధికారులను అభినందిస్తున్నానని తెలిపారు.

# ఎస్.ఎల్. గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ అండ



**కరీంనగర్ మహా:** ఇటీవల మృతి చెందిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్ (ఎస్.ఎల్. గౌడ్) కుటుంబాన్ని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. మంగళవారం రాత్రి తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామంలోని ఎస్.ఎల్. గౌడ్ నివాసానికి మంత్రి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎస్.ఎల్. గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో కుటుంబానికి పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఎస్.ఎల్. గౌడ్ చివరి వరకు కాంగ్రెస్ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేశారని మంత్రి పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి, అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన సీనియర్ నాయకుడిని కోల్పోవడం పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన సేవలను పార్టీ శ్రేణులు ఎప్పటికీ గుర్తుంచుకుంటాయని తెలిపారు.

# నకిలీ ఆస్తులతో బ్యాంకులకు టోకరా



- సబ్‌రిజిస్ట్రార్ అరెస్టుతో కదిలిన డొంక.
- భూములే లేవు.. సర్వే నంబర్లూ నకిలీవే.
- కాగితాలపై ఆస్తులు సృష్టించి రూ.4.11 కోట్ల రుణాలు.

**హైదరాబాద్, మహా .** ఆస్తి లేదు.. ఇల్లు లేదు.. స్థలం అసలే లేదు. కానీ రికార్డుల్లో మాత్రం కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నట్లు సృష్టించారు. నకిలీ సర్వే నంబర్లు, రికార్డుల్లో లేని ఇంటి నంబర్లతో పత్రాలు తయారు చేసి వాటిని రిజిస్ట్రేషన్ చేయించారు. అనంతరం ఆ కాగితాలనే నిజమైన ఆస్తులుగా చూపిస్తూ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. కొంతకాలం వాయిదాలు చెల్లించి ఆ తర్వాత చేతులెత్తేశారు. రుణాలు వసూలు చేసేందుకు బ్యాంకు అధికారులు ఆస్తుల వద్దకు వెళ్లినప్పుడు అక్కడ ఏ ఆస్తీ లేకపోవడంతో అసలు మోసం బయటపడింది. ఈ వ్యవహారంపై కీసర పోలీసులు దర్యాప్తు చేపట్టగా నకిలీ ఆస్తుల వెనుక పెద్ద ముఠా ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం చంపాపేట సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న, గతంలో కీసర సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన మహ్మద్ యూసుఫ్ ఉర్ రెహ్మాన్ అరెస్టుతో కేసు మరింత కీలక మలుపు తిరిగింది.

**కాగితాలపైనే కోట్ల ఆస్తులు**

బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న కొందరు వాయిదాలు చెల్లించకపోవడంతో ఆర్థిక సంస్థలు ఆస్తుల తనిఖీ, జప్తు ప్రక్రియకు శ్రీకారం చుట్టాయి. రుణానికి హామీగా చూపించిన ఆస్తులను పరిశీలించేందుకు వెళ్లిన అధికారులకు అవి భౌతికంగా లేవన్న విషయం తెలిసింది. రికార్డుల్లో ఉన్నట్లు కనిపిస్తున్న ఆస్తులు వాస్తవంలో లేకపోవడంతో బ్యాంకు అధికారులు పోలీసులను ఆశ్రయించారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా కీసర పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా ఒకదాని వెంట మరొకటి నకిలీ రిజిస్ట్రేషన్ల వ్యవహారాలు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**ఒకటి కాదు.. ఏకంగా 11 ఆస్తులు**

పోలీసుల దర్యాప్తులో బోడుప్పల్‌కు చెందిన బుర్ర మహేశ్ యాదవ్ పేరుతో నకిలీ ఆస్తులు సృష్టించిన వ్యవహారం బయటపడింది. మహేశ్ పేరుతో వాస్తవంగా ఆస్తులు లేకపోయినా నాగారం ప్రాంతంలోని సర్వే నంబర్లు 400, 401లో మూడు ఆస్తులు ఉన్నట్లు నకిలీ పత్రాలు తయారు చేసినట్లు పోలీసులు గుర్తించారు. మహేశ్, ఆయన భార్య, మరో వ్యక్తి పేర్లపై ఆస్తులు ఉన్నట్లు చూపించి రిజిస్ట్రేషన్లు చేయించినట్లు తెలిపారు. ఇదే తరహాలో ఉనికిలో లేని మొత్తం 11 ఆస్తులను కాగితాలపై సృష్టించి వివిధ బ్యాంకుల నుంచి సుమారు రూ.4.11 కోట్ల రుణాలు పొందినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రారంభంలో కొంతకాలం రుణ వాయిదాలు చెల్లించిన నిందితులు ఆ తర్వాత చెల్లింపులు నిలిపివేసినట్లు తెలిపారు.

**సబ్‌రిజిస్ట్రార్ పాత్రపై పోలీసుల దర్యాప్తు**

నకిలీ ఆస్తులు ఎలా రిజిస్ట్రేషన్ అయ్యాయన్న దానిపై దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు అప్పటి కీసర సబ్‌రిజిస్ట్రార్ మహ్మద్ యూసుఫ్ ఉర్ రెహ్మాన్ పాత్ర వెలుగులోకి వచ్చినట్లు డీసీపీ శ్రీధర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన చంపాపేట సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్నారు. 2015 నుంచి 2023 వరకు కీసర సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన కాలంలో నకిలీ ఆస్తుల రిజిస్ట్రేషన్లలో ఆయన పాత్రపై విచారణ సాగుతోంది.

> **29 మంది పాత్రపై ఆరా**
>
> ఈ వ్యవహారం కేవలం కొందరు రియల్టర్లకే పరిమితం కాలేదని పోలీసుల దర్యాప్తులో తేలినట్లు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన రియల్టర్ వల్లభనేని శ్రీనివాసరావు, బోయిన్‌పల్లికి చెందిన వేణుగోపాల్, శ్రీశైలం, దినేశ్, భరత్, బోడుప్పల్‌కు చెందిన బుర్ర మహేశ్ యాదవ్ తదితరులు ముఠాగా ఏర్పడి ఈ వ్యవహారానికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.బ్యాంకు సిబ్బంది, కీసర రిజిస్ట్రేషన్ కార్యాలయ సిబ్బంది సహా మొత్తం 29 మంది పాత్రపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, మరికొందరిని త్వరలో అరెస్టు చేసే అవకాశం ఉందని డీసీపీ శ్రీధర్ వెల్లడించారు.

ఆస్తులు భౌతికంగా లేనప్పటికీ ఉన్నట్లు చూపించి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సహకరించినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. వివాదాస్పద విక్రయ పత్రాలు, ఇతర కీలక పత్రాలను ఆయన వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

**ఫిర్యాదుదారుడే నిందితుడిగా మారిన వైనం**

ఈ కేసులో మరో ఆసక్తికర పరిణామాన్ని పోలీసులు గుర్తించారు. తన పేరుతో నకిలీ ఆస్తి సృష్టించారంటూ తొలుత బుర్ర మహేశ్ యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే అనంతరం అదే వ్యవహారంలో భాగమైన ముఠాతో చేతులు కలిపి సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. దర్యాప్తులో ఈ అంశం బయటపడటంతో అధికారులు విస్తుపోయారు.

**జూలై 24న అరెస్టులతో మొదలు**

బ్యాంకు అధికారుల ఫిర్యాదు ఆధారంగా జూలై 24న వల్లభనేని శ్రీనివాసరావుతో పాటు మరో ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఆ కేసు దర్యాప్తును లోతుగా కొనసాగించగా నకిలీ ఆస్తుల రిజిస్ట్రేషన్ల వెనుక మరింత విస్తృతమైన వ్యవస్థ ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి సబ్‌రిజిస్ట్రార్ యూసుఫ్ ఉర్ రెహ్మాన్ పాత్రపై పోలీసులు దృష్టి సారించారు.తొలుత ఒకటి రెండు ఆస్తులకు సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్లుగా భావించిన వ్యవహారం విచారణ ముందుకు సాగేకొద్దీ వందల సంఖ్యలో అనుమానాస్పద రిజిస్ట్రేషన్ల వరకు విస్తరించినట్లు అధికారులు చెబుతున్నారు.

**2015 నుంచి సాగిందా అక్రమ దందా?**

యూసుఫ్ ఉర్ రెహ్మాన్ 2015 నుంచి 2023 వరకు కీసర సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన సమయంలో ఈ తరహా అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ కాలంలో నమోదైన అనుమానాస్పద ఆస్తి రిజిస్ట్రేషన్లను అధికారులు పరిశీలిస్తున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్ వెనుక ఎవరున్నారు? నకిలీ పత్రాలు ఎవరు తయారు చేశారు? వాటిని రిజిస్ట్రేషన్‌కు ఎవరు తీసుకొచ్చారు? బ్యాంకు రుణాల కోసం వాటిని ఎలా ఉపయోగించారు? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

**బ్యాంకులకూ హెచ్చరికగా మారిన ఘటన**

నకిలీ ఆస్తి పత్రాల ఆధారంగా బ్యాంకుల నుంచి కోట్ల రూపాయల రుణాలు పొందిన ఘటన ఆర్థిక సంస్థల తనిఖీ విధానాలపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతోంది. రుణం మంజూరు చేయడానికి ముందు ఆస్తి వాస్తవంగా ఉందా? రిజిస్ట్రేషన్ పత్రాలు అసలైనవేనా? సర్వే నంబర్లు, ఇంటి నంబర్లు ప్రభుత్వ రికార్డుల్లో ఉన్నాయా? అనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన ఎంత కీలకమో ఈ వ్యవహారం స్పష్టం చేస్తోంది.

**దర్యాప్తులో మరిన్ని అరెస్టులు?**

ప్రస్తుతం అరెస్టయిన నిందితుల విచారణ, స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు రుణాల వివరాలు, రిజిస్ట్రేషన్ రికార్డుల ఆధారంగా పోలీసులు దర్యాప్తును మరింత విస్తరిస్తున్నారు. ఇప్పటివరకు వెలుగులోకి వచ్చిన వ్యవహారం కంటే మరింత పెద్ద స్థాయిలో నకిలీ రిజిస్ట్రేషన్లు జరిగి ఉండొచ్చన్న అనుమానంతో పాత రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ANN తెలుగు

మహా పత్రిక

బుధవారం, హైదరాబాద్ | 16-09-2026 | సంపాదకీయం | EDITOR IAL | WWW.MAHAADAILY.COM













## వైభవంగా..

# తిరుమల బ్రహ్మోత్సవాలు ఆరంభం

## గోవింద నామస్మరణతో మార్మోగిన తిరుమలగిరులు

## సంప్రదాయబద్ధంగా శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



**తిరుమల, మహా :** తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సాయంత్రం 6.21 నుంచి 6.35 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాల మధ్య మంగళవాద్యాలు మోగుతుండగా అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. సకల దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ముందుగా బంగారు తిరుచ్చిపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామివారిని, పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి వారిని, ధ్వజపటాన్ని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్, చిన్న జీయర్, తితిదే ఈవో ముద్దాడ రవిచంద్ర, కంకణ బట్టర్ వెంకట రాఘవ దీక్షితులు, తితిదే బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ, భాను ప్రకాశ్‌రెడ్డి, పనబాక లక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా తిరుమత శ్రీవారికి ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించగా, తనయుడు మంత్రి లోకేష్, కోడలు బ్రాహ్మణి , పలువురు మంత్రులు హాజరయ్యారు.

**.సంప్రదాయబద్ధంగా శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ**

సంప్రదాయ వస్త్రధారణలో తిరుమలకు చేరుకున్న ముఖ్యమంత్రి కుటుంబం, ముందుగా బేడి ఆంజనేయస్వామివారిని దర్శించుకుంది. ఆ తర్వాత పవిత్ర పట్టువస్త్రాలను తలపై ధరించి, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయ ప్రవేశం చేశారు. నిర్ణీత ముహూర్తంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం గర్భాలయంలోని మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టువస్త్రాల సమర్పణ అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ముఖ్యమంత్రి దంపతులకు వేదాశీర్వచనం అందజేసి, స్వామివారి తీర్థప్రసాదాలు ప్రసాదించారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలువురు ప్రముఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే టాలీవుడ్ ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ వేడుకల్లో ప్రత్యేకంగా దర్శనమిచ్చారు.















# యువత "మోక్షగుండం విశ్వేశ్వరయ్య"ని స్ఫూర్తిగా తీసుకోవాలి

- సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, తిరుమల రావు
- ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** యువత "మోక్షగుండం విశ్వేశ్వరయ్య"ని స్ఫూర్తిగా తీసుకోవాలని సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, తిరుమలరావులు అన్నారు. మంగళవారం సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హెడ్డాఫీస్ ఎదురుగా గల మోక్షగుండం విశ్వేశ్వరయ్య చౌక్ ఆవరణలో భారత దేశం గర్వించే సివిల్ ఇంజినీర్ భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలలో సింగరేణి సంస్థ డైరెక్టర్(ఆపరేషన్స్)ఎల్.వి.సూర్యనారాయణడైరెక్టర్(ఈ అండ్ఎం) ఎం.తిరుమలరావు, వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, యూనియన్ నాయకులు పాల్గొని మోక్షగుండం విశ్వేశ్వరయ్య కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్లు మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ ఇంజనీర్లలో ఒకరుగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఎదగడం భారతదేశానికి ఎంతో గర్వకారణం అన్నారు. భారతదేశం యొక్క ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పినటువంటి మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మదినాన్ని ఇంజనీర్స్ డే గా నిర్వహించుకోవడం ఎంతో సంతోషదాయకమని తెలిపారు. అదేవిధంగా ప్రస్తుత యువత మోక్షగుండం విశ్వేశ్వరయ్యని స్ఫూర్తిగా తీసుకొని ఇంజనీరింగ్ లో ప్రగతిని తీసుకురావడానికి తమ వంతు కృషి చేయడానికి పూనుకోవాలన్నారు. ఈనాడు భారతదేశంలో ప్రతిష్ఠాత్మకమైనటువంటి ఇంజనీరింగ్ ప్రాజెక్టులను చేపట్టడం కోసం పునాదులు వేయడం మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్ఫూర్తితో కూడా సాగిందని చెప్పుకోవచ్చు అని తెలియజేశారు. ప్రతీ ఏడాది ఒకొక్క థీమ్ తో ఈ యొక్క ఇంజనీర్స్ డే చేసుకుంటున్నామని ఈ ఏడాది "డిజిటలైజేషన్ ద్వారా స్థిరమైన భవిష్యత్తు కోసం స్మార్ట్ ఇంజనీరింగ్" అనే థీమ్ తో నిర్వహించుకుంటున్నామని ఇంజనీర్లు ప్రస్తుతం ఉన్న ఆధునిక టెక్నాలజీలను ఉపయోగిస్తూ విలువలతో కూడిన ఇంజనీరింగ్ పని తనంతో నాణ్యమైన ప్రాజెక్టులను నిర్మించి భావి తరాల వారికి అందించి భారత దేశ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. సివిల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఇంచార్జ్ జిఎం(సివిల్) ఆర్.సతీష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ, డైరెక్టర్(ఈ అండ్ ఎం)ఎం.తిరుమల రావు, (ఏఐటియూసి) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వి.రమణ మూర్తి, ఐఎన్టియూసి కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవరావు, జిఎం(సిపి అండ్ పి) ఏ.మనోహర్, జనరల్ మేనేజర్(పి అండ్ పి)జి.దేవేందర్, జిఎం(ఆర్ అండ్ డి) సిహెచ్.శ్రీనివాస్, జిఎం(ట్రాన్స్పోర్ట్) ఎం.రామనాధం, జిఎం(ఈ అండ్ఎం) వర్క్ షాప్ అండ్ఎనర్జీ మేనేజ్మెంట్)కె. శ్రీనివాసులు, డిజిఎం(సివిల్) జి.సూర్యనారాయణ, ఎస్ఈ(సివిల్) పి.రాజేంద్ర ప్రసాద్, ఇతర జిఎంలు, వివిధ విభాగాల ఇంజనీర్లు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నూతన పెన్షన్ల దరఖాస్తుల పరిశీలన

**వలిగొండ సెప్టెంబర్ 15 మహా న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నూతన పెన్షన్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను వలిగొండ ఎంపీడీవో జలంధర్ రెడ్డి ప్రతి ఇల్లులు తిరుగుతూ పరిశీలించారు నిజమైన లబ్ధిదారులకు అన్యాయం జరగదు అనేదే ప్రభుత్వ ఉద్దేశం అని ఆయన తెలిపారు ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆశించారు



## విప్పలగుంపులో వైద్య శిబిరం..

- గిరిజనులకు రక్త పరీక్షలు..
- జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచన

**మణుగూరు, మహా :** మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వలస ఆదివాసీ గిరిజన గ్రామమైన విప్పలగుంపు, ఎస్టీ కాలనీలో వైద్య సిబ్బంది ఆరోగ్య శిబిరం నిర్వహించారు. గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్కు పంపించారు. మలేరియా అనుమానిత కేసును మెరుగైన వైద్య పరీక్షల కోసం ఏరియా ఆసుపత్రికి పంపించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల వ్యాప్తికి అవకాశం లేకుండా ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని డాక్టర్ ఉమాదేవి సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, జ్వరం వచ్చినవారు నిర్లక్ష్యం చేయకుండా ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించి రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం గ్రామంలో డ్రై డే నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అనసూర్య, రాంప్రసాద్, కృష్ణ, కౌసల్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీని చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డిజిటల్ (స్మార్ట్) రేషన్ కార్డులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 1,23,000 (లక్షా ఇరవై మూడు వేల) పాత రేషన్ కార్డులను ప్రభుత్వం అత్యాధునిక డిజిటల్ (స్మార్ట్) కార్డులుగా మార్చి లబ్ధిదారులకు అందించామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, రేషన్ కార్డులు లేని అర్హులైన పేదల కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. దీని ద్వారా నియోజకవర్గంలో కొత్తగా నమోదైన సుమారు 60 వేల మందికి రేషన్ కార్డు నమోదుకు అవకాశం లభించిందన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రేషన్ సరుకులు పారదర్శకంగా అందాలనే ఉద్దేశ్యంతో ఈ స్మార్ట్ కార్డుల జారీ చేపట్టినట్లు తెలిపారు. కొత్తగా 60 వేల మందికి రేషన్ కార్డుల కోసం నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ తహసిల్దార్ బోమ్మ రాములు, పౌరసరఫరాల శాఖ అధికారి పుల్లయ్య, గండిపేట్ శంషాబాద్ రెవెన్యూ అధికారులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ ను అవమానిస్తే సహించేది లేదు

- హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భారతరత్న అంబేద్కర్ పై అవాకులు చవాకులు పేలుతూ అవమాన పరుస్తూ భారత రాజ్యాంగాన్ని సైతం అపహాస్యం పాలు చేస్తూ మత విద్వేషాలను కులవిద్వేషాలను రెచ్చగొడుతూ విర్రవీగుతున్న హమారా ప్రసాద్(ఆవారా ప్రసాద్) ను వెంటనే యుఏపిఏ చట్టం కింద అరెస్ట్ చేయాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తగూడెం క్లబ్ లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా శివకుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ పై అవాకులు చవాకులు పేలుతూ విషం చిమ్ముతున్న మతతత్వ ఉగ్రవాది హమారా ప్రసాద్ ను కఠినంగా శిక్షించాలన్నారు. సామాజిక న్యాయం కోసం సమ సమాజ స్థాపన కోసం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంటరానితనం కుల నిర్మూలన కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. భారత రాజ్యాంగాన్ని రచించి అందులో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలు మహిళలు ఆర్థికంగా వెనుకబడిన అగ్ర వర్ణాలకు సైతం రిజర్వేషన్లను కల్పించి దేశ సౌభ్రాతృత్వానికి సమైక్యతకు సమగ్రతకు అభివృద్ధికి దశ దిశ నిర్దేశకత్వాన్ని చూయించిన మార్గదర్శకుడు అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ అవమానపరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మూడ్ గణేష్, పసుపులేటి వీరబాబు, జేబీ శౌరి, నాగ సీతారాములు, ఎర్రా కామేష్, నయీమ్ ఖురేషి, లక్ష్మణ్ నాయక్ లతోపాటు టీఈఏఎం రాష్ట్ర కన్వీనర్, అభ్యుదయ అధ్యాపకులు దాసరి రమేష్, రాష్ట్ర గౌరవ సలహాదారులు సింగరేణి రిటైర్డ్ జిఎం శనగ వెంకటేశ్వర్లు, తెలంగాణ ఉద్యమ యోధుడు సయ్యద్ రషీద్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పిఏ ప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం నుండి శంకర్, ఆర్గనైజర్ బూర్గుల కరుణాకర్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతోటి పాల్,టి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుండా రమేష్, సంఘ ప్రధాన కార్యదర్శి అపరబాలు అల్లి శంకర్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరం వరప్రసాద్, ప్రముఖ అంబేద్కర్ వాది న్యాయవాది మారపాక రమేష్, రాష్ట్ర ఆటో యూనియన్ అధ్యక్షులు కంచర్ల జమలయ్య, ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు డి.సుధాకర్, జె.ఉపేందర్, సోషల్ యాక్టివిస్ట్ మెంటం బలరాం, యోగా మాస్టర్ గుమలాపురం సత్యనారాయణ, మహిళా నాయకురాళ్లు భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకురాళ్లు బడికల పుష్పలత, కుంచె లావణ్య, మహిళా సమాఖ్య క్రియాశీలక నాయకురాలు కరీష రత్నకుమారి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి, నాయకురాలు దార్ల లక్ష్మి, మైనారిటీ నాయకురాలు కైసర్, స్వరూప, ప్రముఖ అంబేద్కర్ వాదులు బి.బిక్కులాల్, సల్లం శంకర్, పృథ్వీరాజ్, జె.శ్రీను, కే.సాగర్, జూలూరుపాడు నుండి ఈ తిరుపతి ప్రభాకర్, పెనగడప శ్రీను, ఇతర నాయకులు రాజేశ్వరరావు, అంతోటి రాజు, ఉమామహేశ్వర్, దేవానంద్, వెంకటేశ్వర్లు, జి.మోహన్, అబ్దుల్లా, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, అప్రయిమ్ చింటూ, సుమన్, అఖిల్, కళాబృందం నుండి కవుటూరి రాము బృందం పాల్గొన్నారు.

# ఉద్యోగ జీవితానికి గుర్తుగా వాటర్ డిస్పెన్సర్ వితరణ

**విరమణ అనంతరం అభిమానం చాటిన వెన్న ఉదయ సేత్**




**జూలూరుపాడు, మహా:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వహించి, గత నెల 31న ఉద్యోగ విరమణ పొందిన వెన్న ఉదయ సేత్ తన ఉద్యోగ జీవితానికి గుర్తుగా పాఠశాల సిబ్బందికి ఉపయోగపడే విధంగా 16వేల రూపాయల విలువైన వోల్టాస్ వాటర్ డిస్పెన్సర్, మినీ ఫ్రిజ్ ను మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీనరసయ్యకి అందజేశారు. ఈ సందర్భంగా వెన్న ఉదయ సేత్ మాట్లాడుతూ తాను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన కాలంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తనను ఎంతో ఆప్యాయంగా, అభిమానంతో, గౌరవంగా చూసుకున్నారని తెలిపారు. పాఠశాలతో తనకు ఏర్పడిన ఆత్మీయ అనుబంధానికి గుర్తుగా ఈ వాటర్ డిస్పెన్సర్ ను అందజేస్తున్నట్లు తెలిపారు.ఉద్యోగ విరమణ అనంతరం కూడా పాఠశాల పట్ల తనకున్న అభిమానం, ఆత్మీయతను చాటుతూ సిబ్బంది ఉపయోగార్థం విలువైన వాటర్ డిస్పెన్సర్ ను అందజేయడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీనరసయ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది వెన్న ఉదయ సేత్ ని అభినందిస్తూ, హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన సేవలను, పాఠశాల పట్ల చూపిన అభిమానాన్ని పాఠశాల సిబ్బంది కొనియాడారు.



# బీసీ కులగణనపై బీజేపీ దిష్టిబొమ్మల దహనం

- శాస్త్రీయ పద్ధతిలో కులాల వారీగా లెక్కించాలి: బీసీ సంక్షేమ సంఘం

**కరీంనగర్ మహా, సెప్టెంబర్ 15:** దేశవ్యాప్తంగా చేపట్టనున్న జాతి జనగణనలో బీసీల జనాభాను కులాల వారీగా శాస్త్రీయ పద్ధతిలో లెక్కించి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. బీసీ కులగణనకు సంబంధించిన డిమాండ్లపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ మంగళవారం గీతాభవన్ సర్కిల్ వద్ద బీజేపీ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో సెప్టెంబర్ 15న దిష్టిబొమ్మల దహనానికి బీసీ సంక్షేమ సంఘం ఇచ్చిన పిలుపులో భాగంగా కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. బీసీ కార్యకర్తలు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. జాతి జనగణనలో ప్రత్యేకంగా బీసీ కులగణన చేపట్టడం ద్వారా బీసీల వాస్తవ జనాభా, సామాజికఆర్థిక పరిస్థితులు స్పష్టంగా వెలుగులోకి వస్తాయని నాయకులు పేర్కొన్నారు. ఓబీసీ కుటుంబాలను సమగ్రంగా లెక్కించి, ప్రతి కులానికి ప్రత్యేక యూనిక్ కోడ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ కాలమ్ తీర్మానానికి బీజేపీ మద్దతు ఇవ్వకపోవడం సరికాదని విమర్శించారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన న్యాయమైన వాటా, అవకాశాలు కల్పించాలంటే కులగణన అత్యంత కీలకమని నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించే వరకు ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన సందర్భంగా స్థానిక పోలీసులు బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి పీటీసీకి తరలించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆనంద్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణుచారి, బీసీ సంక్షేమ సంఘం నాయకులు గోడిషాల రమేష్, పురుషోత్తం ఆశిష్, సుధాకర్, శ్రీనివాస్, వెంకటస్వామి, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఘనంగా హిందీ దివస్ వేడుకలు



**వేములవాడ, మహా:** వేములవాడ రూరల్ మండలంలోని చెక్కపెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ దివస్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా "ఏక్ పేడ్ హిందీ దివస్ కే నామ్ సే " అంశంపై విద్యార్థులకు వివరించారు.అనంతరం ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లోకిని కిషన్ అధ్యక్షత వహించగా,పాఠశాల హిందీ భాషా పండితులు రేపాక రవి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ లోకిని కిషన్ మాట్లాడుతూ భారతదేశంలో విభిన్న సంస్కృతులు,భాషలు ఉన్నప్పటికీ దేశ ప్రజలను ఏకం చేయడంలో హిందీ భాష కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.విద్యార్థులు మాతృభాషతో పాటు జాతీయ భాష అయిన హిందీని నేర్చుకుంటే దేశవ్యాప్తంగా ఉన్నత అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని సూచించారు.పాఠశాల హిందీ ఉపాధ్యాయులు రేపాక రవి మాట్లాడుతూ, 1949 సెప్టెంబర్ 14న రాజ్యాంగ సభ హిందీని అధికార భాషగా గుర్తించిందని గుర్తుచేశారు. అప్పటి నుండి మన దేశంలో ప్రతి సంవత్సరం 14 సెప్టెంబర్ నాడు హిందీ దివస్ జరుపుకుంటున్నామన్నారు.హిందీ నేర్చుకోవడం వల్ల జాతి సమైక్యతకే కాకుండా జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి రంగాల్లో రాణించడానికి విస్తృత అవకాశాలు లభిస్తాయని విద్యార్థులకు వివరించారు. ఈ వేడుకల సందర్భంగా విద్యార్థులకు హిందీ వ్యాసరచన, హిందీ TLM , దేశభక్తి గీతాలాపన మరియు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్ , నీరజ , సంతోష్ , రాజు, అజయ్, సురేష్ మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకం..

- మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం..
- ఎరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్



**మణుగూరు, . మహా :** దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర అత్యంత కీలకమని, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య అందించిన సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని ఎరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ అన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య 165వ జయంతిని పురస్కరించుకుని మణుగూరు ఏరియాలో మంగళవారం ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పీవీ కాలనీ కమ్యూనిటీ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గం రామచందర్, విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన, సాంకేతిక పురోగతిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజల సంక్షేమానికి, దేశ అభివృద్ధికి వినియోగించి ఇంజినీరింగ్ రంగంలో చెరగని ముద్ర వేసిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. దూరదృష్టి, సృజనాత్మక ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యం, అంకితభావంతో దేశ నిర్మాణంలో విశిష్టమైన సేవలు అందించారని పేర్కొన్నారు. ముఖ్యంగా నీటి వనరుల అభివృద్ధి, నీటిపారుదల, వరద నియంత్రణ రంగాల్లో ఆయన చేసిన కృషి భారతదేశ అభివృద్ధికి ఎంతో దోహదపడిందన్నారు. దేశంలోని అనేక ప్రతిష్ఠాత్మక ఇంజినీరింగ్ ప్రాజెక్టుల రూపకల్పన, అభివృద్ధిలో విశ్వేశ్వరయ్య కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో సత్కరించిందని గుర్తుచేశారు. ఆయన జీవితం, కృషి, విలువలను నేటి తరం, ముఖ్యంగా యువ ఇంజినీర్లు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఇంజినీర్లు విశ్వేశ్వరయ్య ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు సాంకేతిక పురోగతి, దేశ ప్రగతికి అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం కెడి వెంకట రామారావు, ఏజీఎం (ఈఅండ్ఎం) కె ఎన్ వివిఎస్ రాంబాబు, ఏజీఎం (పర్సనల్) ఎస్ రమేష్, డీజీఎం (సివిల్) శివప్రసాద్, ఏరియా సర్వే అధికారి ఎల్ నాయక్, ఏరియా సేఫ్టీ అధికారి జి. నాగేశ్వరరావు, పర్యావరణ అధికారి జె శ్రీనివాసరావు, క్వాలిటీ విభాగం సుబ్రహ్మణ్యం, ఏరియా సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాసరావు, సీనియర్ పర్సనల్ అధికారి కెకె రాజేంద్ర ప్రసాద్, పర్సనల్ అధికారులు కెకె. శ్రీనివాస్, పి రామేశ్వరరావుతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల్లో ఎమ్మెల్యే పాయం సందడి..

- ఆయా మండపాల ఉత్సవ కమిటీలతో మాటామంతీ..
- మండపాల్లో భక్తులకు ఆప్యాయ పలకరింపులు
- గణనాథుడికి ప్రత్యేక పూజలు..
- ప్రజల సుఖసంతోషాల కోసం ప్రార్థనలు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని గణేష్ మండపాల్లో సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందడి చేశారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు హాజరై గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల ఉత్సవ కమిటీ సభ్యులతో మాటామంతీ జరిపారు. మండపాలకు వచ్చిన భక్తులు, స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వ్యాపారులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందాలని, వ్యాపారులు, ప్రజలపై గణనాథుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి మహోత్సవాలకు హాజరయ్యారు. మార్కెట్ వ్యాపారులు, ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడారు. అక్కడి భక్తులను పలకరిస్తూ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణుగూరు లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24వ మహా గణపతి నవరాత్రి మహోత్సవాల్లోనూ ఎమ్మెల్యే పాల్గొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆయనకు స్వాగతం పలికారు. వారితో కొద్దిసేపు మాట్లాడిన అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అలాగే సాయి బాలాజీ నగర్ (అశోకనగర్)లో నిర్వహిస్తున్న మహా గణపతి 10వ నవరాత్రి మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానికులతో మాట్లాడి భక్తులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో పినపాక నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినాకి నవీన్, ఆయా గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, కూరగాయల మార్కెట్, లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.



# టీపీసీసీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు

- **టీజీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ**

**హనుమకొండ, మహా :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షులుగా రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గాంధీభవన్ లో బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కలిసి పూల మొక్కను అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ, మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మరింత బలోపేతం అయిందని, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపారని కొనియాడారు. సామాన్య కార్యకర్త నుండి రాష్ట్ర అధ్యక్షుడి స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడంలో, ప్రజా సమస్యలపై పోరాటం చేయడంలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమని, మహిళా కాంగ్రెస్ తరపున ఎల్లప్పుడూ ఆయనకు పూర్తి మద్దతు ఉంటుందని ఎర్రబెల్లి స్వర్ణ తెలిపారు.

# భూ రీసర్వే పై రైతులకు అవగాహన తప్పనిసరి

- **పరిశీలించిన వివరాలను పక్కాగా నమోదు చేయాలి**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**ఖిలా, వరంగల్ మహా ;** వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ మండలంలోని వసంతపూర్ గ్రామంలో మంగళవారం భూ రీసర్వే ప్రక్రియపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని రైతులకు రీసర్వే ప్రక్రియ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీసర్వే ద్వారా భూ హక్కులు, సరిహద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పక్కాగా నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. రీసర్వే ప్రక్రియలో రైతులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వే సమయంలో రైతులు అధికారులకు సహకరించాలని, భూ వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లు లేకుండా క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు రీసర్వేకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందించి, వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. అనంతరం వరంగల్ మండలంలోని కొత్తపేట గ్రామంలో నిర్వహిస్తున్న ఫీల్డ్ రీసర్వే పనులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో కలిసి రీసర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల సరిహద్దులు, సర్వే వివరాల నమోదు తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సమక్షంలోనే క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని, భూ వివరాల నమోదులో ఖచ్చితత్వం పాటించాలని అధికారులకు సూచించారు. రీసర్వే ద్వారా భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం లేకుండా స్పష్టమైన భూ రికార్డులు రూపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ కె కిషోర్ కుమార్, ఆర్డీవో సుమ, ఏడి సర్వే మరియు రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్దార్లు శ్రీకాంత్ ,ఇక్బాల్,తో పాటు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆదిభట్లలో ప్రైవేట్ బస్సు దగ్ధం..!

**ఆదిభట్ల సెప్టెంబర్ 15 మహా:** ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ ప్రైవేట్ బస్సు దగ్ధమైంది..! మంటలను ఫైర్ సిబ్బంది అదుపు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని నయరా పెట్రోల్ బంక్ సమీపంలో శ్రీనివాస ట్రావెల్స్‌కు చెందిన బస్సులో ఏసీ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని తెలిపారు. దీంతో మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న ఆదిభట్ల పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు, బస్సులో మంటలు చెలరేగడానికి గల కారణాలను దర్యాప్తు చేపట్టిన అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.



# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- **కార్పొరేషన్ మేయర్ గణేష్**
- **కుట్టుమిషన్ల శిక్షణ సర్టిఫికెట్స్ పంపిణీ**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ అన్నారు. రామవరంలోని 16వ డివిజన్ పరిధిలో మదర్ తెరిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ మునిగడప పద్మ హాజరై మాట్లాడుతూ మహిళలు స్వశక్తితో ఎదగడం అనేది ఆలోచన రావడం గర్వించదగ్గ విషయమని అన్నారు. ఇలాగే ప్రతి మహిళ కుటుంబంలో ఆర్థికంగా చేదోడువాదోడుగా ఉంటూ తన కాళ్లపై తన నిలబడి సమాజంలో ఒక గౌరవాన్ని పొందాలని సూచించారు.కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో మహిళల స్వయం ఉపాధికి తమ వంతుగా అవకాశమున్న ప్రతి పనిని అందుబాటులోకి తేవడానికి శాయశక్తుల ప్రయత్నం చేస్తామన్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం పాటుపడుతున్న మదర్ తెరిసా ఫౌండేషన్ స్టేట్ కోఆర్డినేటర్ సంధ్యా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మహిళలంతా క్రమశిక్షణతో శిక్షణ పొంది వృత్తిలో రాణించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టైలరింగ్ శిక్షణ ఇచ్చిన టీచర్ కవిత, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, న్యాయవాది మునిగడప వెంకటేశ్వర్లు, శిక్షణకు వసతి గృహాన్ని అందించిన దండే భాగ్యలక్ష్మి, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.



# శంషాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

**జనసేవకుడు కంది కట్ల సిద్దిరెడ్డి**

**రాజేంద్రనగర్ మహా :** జన సేవకుడు ప్రముఖ వ్యాపారవేత్త కందకట్ల సిద్దురెడ్డి గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. అయినకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల భవనం, తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠశాలకు అవసరమైన మౌలిక వసతులను త్వరలోనే తన సొంత ఖర్చులతో కల్పిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. సిద్దిరెడ్డి ఇచ్చిన హామీ పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, హర్షం వ్యక్తం చేశారు. గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన సిద్దిరెడ్డి సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రశాంత్ రెడ్డి, అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి

- **గణేష్ వేడుకలకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలి**
- **కరీంనగర్ టౌన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సన్‌ప్రీత్ సింగ్, గౌష్ ఆలం**

**కరీంనగర్ మహా:** నేరాల నియంత్రణతో పాటు పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం, ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ అందించడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ పోలీస్ కమిషనర్, రాజన్న జోన్3 డీఐజీ (HFAC) సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ మంగళవారం కరీంనగర్ టౌన్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయానికి చేరుకున్న ఉన్నతాధికారులకు పోలీసు అధికారులు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించిన అధికారులు డివిజన్ పరిధిలో నమోదైన నేరాలు, పెండింగ్ కేసులు, సీసీటీఎన్ఎస్ నిర్వహణ, శాంతిభద్రతల పరిస్థితిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని, దర్యాప్తులను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చూడాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను సున్నితంగా పరిష్కరించాలని పోలీసు అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**గణేష్ చతుర్థి వేడుకలపై ప్రత్యేక దృష్టి**

రానున్న వినాయక చవితి వేడుకల నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. గణేష్ మండపాలు, ఊరేగింపులు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన నిఘా కొనసాగించాలని సూచించారు. ఈ తనిఖీలో కరీంనగర్ టౌన్ ఏసీపీ సి.హెచ్. వెంకటస్వామి, టౌన్ ఇన్‌స్పెక్టర్లు రామచందర్ రావు, తిరుమల్, పుల్లయ్యతో పాటు డివిజన్ పరిధిలోని ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# పాలకుర్తి ఎమ్మార్వోపైఎస్టీ కమిషన్ విచారణ!?

**భూమి బదిలీ వ్యవహారంపై ఫిర్యాదు.. రేపు అధికారుల హాజరు**

**పెద్దపల్లి మహా :** పాలకుర్తి మండల తహసీల్దార్ (ఎమ్మార్వో)పై ఎస్టీ కమిషన్ విచారణకు రంగం సిద్ధమైనట్లు సమాచారం. భూమి బదిలీ వ్యవహారానికి సంబంధించిన ఎస్టీ కమిషన్ అధికారులు బుధవారం విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.? ఈ నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు విచారణకు హాజరై తమ వద్ద ఉన్న రికార్డులు, నివేదికలను సమర్పించనున్నట్లు సమాచారం.బతికే ఉన్న మహిళను మృతురాలిగా నిర్ధారించి, ఆమెకు సంబంధించిన భూమిని ఇతరుల పేర్లపై బదిలీ చేశారనే ఆరోపణలు ఈ వ్యవహారంలో ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఈ విషయంపై బాధిత మహిళ ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించడంతో పాటు ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. ఫిర్యాదుపై స్పందించిన ఎస్టీ కమిషన్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు పెద్దపల్లి జిల్లా పాలకుర్తికి రానున్నట్లు సమాచారం. విచారణలో సంబంధిత భూ రికార్డులు, మ్యూటేషన్ వివరాలు, రెవెన్యూ శాఖకు సంబంధించిన పత్రాలు, అధికారుల నివేదికలను పరిశీలించే అవకాశం ఉంది . ఇదిలా ఉండగా.. ఈ వ్యవహారంలో కొంతమంది ఉన్నతాధికారులు సంబంధిత అధికారిని కాపాడే దిశగా ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉద్యోగ వర్గాల్లో, స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. కొందరు ఉన్నతాధికారుల హస్తం ఉన్నట్లు, వారి భాగస్వామ్యం ఉన్నట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారం వెనుక అసలు కారణాలపై కూడా చర్చ జరుగుతోంది. రాజకీయ స్థాయిలో పైరవీలు సైతం జరుగుతున్నాయనే టాక్ స్థానికంగా వినిపిస్తోంది. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. రేపటి విచారణలో అధికారులు సమర్పించే రికార్డులు, నివేదికలు, అలాగే బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. భూమి బదిలీ ప్రక్రియలో నిబంధనలు పాటించారా? బాధితురాలిని మృతురాలిగా ఎలా నిర్ధారించారు? భూమి ఇతరుల పేర్లపై ఏ ప్రాతిపదికన బదిలీ అయింది? అనే అంశాలపై విచారణలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒక ఉన్నతాధికారి ఈ వ్యవహారం దృష్ట ఆరోగ్య కారణాల చేత ఇంటికే పరిమితమైనారు చర్చ జోరుగా సాగుతుంది. కొంతమంది అధికారులకు ఈ వ్యవహారంలో తైలాలు ముట్టినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి? ఎస్టీ కమిషన్ విచారణ అనంతరం ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ విచారణతో వ్యవహారంలోని వాస్తవాలు వెలుగులోకి వస్తాయా? బాధ్యులపై చర్యలు ఉంటాయా? అనేది వేచి చూడాల్సి ఉంది.




# అమరుల త్యాగాలను బీజేపీ మరువదు

- **తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలి**
- **బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు**

**వరంగల్, చౌరస్తా మహా;** సెప్టెంబర్ 17 ను తెలంగాణ చరిత్రలో అత్యంత కీలకమైన, మరుపురాని చారిత్రక ఘట్టమని, నిజాం నిరంకుశ పాలన నుంచి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం అయిన ఈ రోజును తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని అమరవీరుల త్యాగాలను బిజెపి పార్టీ ఎప్పుడూ మరువలేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు సూచనల మేరకు, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు అధ్యక్షతన వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చౌరస్తా లోని కె. కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా ప్రదీప్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కావడం తెలంగాణ చరిత్రలో కీలక మలుపు అని అన్నారు. నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల దమనకాండకు వ్యతిరేకంగా జాతీయవాదులు, స్వాతంత్ర్య సమరయోధులు, సామాన్య ప్రజలు చేసిన పోరాటాలు, త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పై ఉందన్నారు.హైదరాబాద్ విమోచన ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటం రెండింటినీ ఒకే చరిత్రగా చిత్రీకరించడం సరికాదని, వాటికి వేర్వేరు లక్ష్యాలు, రాజకీయ నేపథ్యాలు, కాలపరిమితులు ఉన్నాయని వారు స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న నిజాం పాలన ముగిసి హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్‌లో విలీనం కాగా, తెలంగాణ సాయుధ పోరాటం ఆ తరువాత కూడా కొనసాగిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించకూడదని, పేర్లు మార్చినంత మాత్రాన చరిత్ర మారదని ప్రదీప్ రావు అన్నారు. తెలంగాణ ప్రజల త్యాగాలు, పోరాటాల చరిత్రను రాజకీయ రంగులు లేకుండా వాస్తవ ఆధారాలతో నేటి తరానికి తెలియజేయాలని కోరారు. పరకాల, బైరాన్‌పల్లి వంటి చారిత్రక ఘటనలను పాఠ్యాంశాల్లో చేర్చి యువతకు తెలియజేయాలని, నిజాం, రజాకార్ల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన వీరుల త్యాగాలను అధికారికంగా స్మరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచింది. అనంతరం సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కు ఓ మెమొరండం సమర్పించడం జరిగిందని వారు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, సిద్ధం నరేష్, రత్నం సతీష్ షా, జలగం రంజిత్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, బన్న ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, కందిమల్ల మహేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాబేటి వెంకట్ గౌడ్, జిల్లా కార్యదర్శి పొనుగోటి వెంకట్ రావు, ఐ.టి ఇంచార్జీ ఆడెపు వెంకటేష్, మీడియా కన్వీనర్ అంకాల జనార్ధన్, బిజెపి నాయకులు బైరి మురళీకృష్ణ, కనుకుంట్ల రంజిత్ కుమార్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, బండి సాంబయ్య యాదవ్, సంగని జగదీశ్వర్, అంబాల రాంగోపాల్, గోగీకర్ అనిల్, జిల్లా మోర్చా అధ్యక్షులు టెకుమట్ల రేణుక, మదాసు రాజు, కూచన క్రాంతి కుమార్, విట్ఠల్ దాసు బోరహా, మహమ్మద్ రఫీ, రేపల్లె స్వర్ణజ, కొమకుల నాగరాజు, సుంకరి రాజు తదితరులు పాల్గొన్నారు.




# వర్షా లు లేక రైతులు విలవిల

- **రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి**
- **వినూత్నంగా ఓ మహిళా రైతు ఫ్లెక్సీ తో సీఎంకు విన్నపం**

**నర్సంపేట, మహా ;** వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం, దుగ్గొండి మండలం లోని వెంకటాపురం గ్రామంలో ఓ మహిళా రైతు రైతులను ఆదుకోవాలని తన పొలంలో వినూత్నంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేసి తన ఆవేదనను సీఎం రేవంత్ రెడ్డికి ఫ్లెక్సీ రూపంలో విన్నవిండం ఇప్పుడు అందరి ఆకర్షిస్తోంది. వరంగల్ జిల్లాలో విస్తారంగా వర్షాలు లేకపోవడంతో అన్నదాతలు అలమటిస్తున్నారని, వరుణ దేవుని కరుణ కోసం ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు, వర్షాలు వస్తాయని నమ్మకంతో అప్పులు తెచ్చి విత్తనాలు జల్లి, నారు పోసిన వర్షాలు కురవకపోవడంతో మధ్యలోనే పంటను వదిలేసారు. కొందరు రైతులు బావులు, కెనాల్ కాలువలు, కుంటల్లో నీరు లేక ఎండిపోయాయి, అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆమె రేవంత్ సర్కార్ ను వేడుకుంటుంది.

# భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- **గురువు సేవలను వెలకట్టలేము...**
- **ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానంలో**
- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**రాజేంద్రనగర్ మహా :** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శంషాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థుల అభివృద్ధికి విశేష సేవలందించిన గురువులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల2026 ప్రధానోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయుల ప్రధాన ఉత్సవానికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యారంగంలో అత్యుత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనది, వారి సేవలు వెలకట్టలేనివి అన్నారు. అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.





## అమరుడు జెంగిలి రవీందర్ కుటుంబానికి మంత్రి పరామర్శ

**మందమర్రి, మహా :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమకారులు, బీఆర్ఎస్ మందమర్రి పట్టణ అధ్యక్షులు స్వర్గీయ జెంగిలి రవీందర్ కుటుంబాన్ని మంగళవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద, స్థానిక నేతలు పరామర్శించారు. ఇటీవల అనారోగ్యంతో రవీందర్ అకాల మృతి చెందిన విషయం తెలిసిందే. ఆ సమయంలో అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఉండడంవల్ల మంత్రి హత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. దీనితో మూడవ జోన్ లోని రవీందర్ నివాస గృహానికి వెళ్లి భార్య, పిల్లలను ఓదార్చారు. రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉన్న రవీందర్ మృతి తనను కలిసి వేసిందని మంత్రి అన్నారు. మృతుడు రవీందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రగాఢ సానుభూతి తెలియపరిచారు. అనంతరం మంత్రి వివేకానంద మాట్లాడుతూ ఉద్యమ సమయంలో రవీందర్ కు తనకున్న అనుబంధాన్ని కుటుంబ సభ్యులతో పంచుకున్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అమరుడు రవీందర్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎండి మజీద్, గాండ్ల సమ్మయ్య, మూడారపు శేఖర్, గుడ్ల రమేష్, ఎండి జావిద్ ఖాన్, ఆకారం రమేష్, రావికంటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## కొయ్య బొమ్మల సంరక్షణకు ప్రత్యేక చర్యలు

- పొనికి చెట్ల పెంపకానికి ప్రోత్సాహం.
- పుష్కరాల్లో విక్రయాలు, ప్రదర్శన స్టాళ్లు
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా భరోసా

**నిర్మల్ మహా:** నిర్మల్ కొయ్య బొమ్మల కళను పరిరక్షిస్తూ, కళాకారులకు ప్రోత్సాహం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు.మంగళవారం నిర్మల్ పట్టణంలోని కొయ్య బొమ్మల ప్రాంగణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కొయ్య బొమ్మల చరిత్ర, తయారీ విధానం, మార్కెటింగ్, కళాకారుల పరిస్థితి, పొనికి కర్ర లభ్యత తదితర అంశాలపై నిర్వాహకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్మల్ కొయ్య బొమ్మలకు దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కళ ద్వారా నిర్మల్ జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించిందని, తరతరాలుగా కొనసాగుతున్న ఈ కళను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బొమ్మల తయారీకి ప్రధానంగా ఉపయోగించే పొనికి చెట్ల పెంపకానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. రానున్న గోదావరి పుష్కరాలను నిర్మల్ కొయ్య బొమ్మల మార్కెటింగ్‌కు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. బాసరలో రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా కొయ్య బొమ్మల ప్రదర్శన,



విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కొయ్య బొమ్మల కళ అభివృద్ధి, కళాకారులకు మరింత ప్రోత్సాహం, మార్కెటింగ్ అవకాశాల పెంపు తదితర అంశాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ పరిశీలనలో డీపీవో శ్రీనివాస్, డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవి బాబు, తహసీల్దార్ రాజు, అధికారులు, నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

### ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి,మహా:** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెల్లడించారు.నెన్నెల మండలంలోని మైలారం గ్రామపంచాయతీలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ డాక్టర్స్ సెల్ -మెడికల్ అండ్ హెల్త్ వింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం లో బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి మంగళవారం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వ్యాధులను ముందుగానే గుర్తించి తగిన వైద్యం పొందాలని సూచించారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలను గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తృతంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, డాక్టర్ చందన సుధాకర్, ఆర్గనైజర్ పి. మహేష్, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పూజలతో సమస్యలు మటాష్ ..

- నకిలీ బాబా మాటల గారడీ
- నమ్మించి అమాయకులను బురిడీ
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు
- దొంగ బాబా దంపతుల అరెస్ట్



**ఆదిలాబాద్ మహా :** నేను గాని పూజ చేసి ఒక మత్రం వేస్తే మీ రోగాలు, సమస్యలు, భయాలు హాంఫట్. ఇలా సొంతగా ప్రచారం చేసుకునేవారి ద్వారానో లేదా తమ అనుచరుల చేత తన గురించి గొప్పగా డబ్బా కొట్టించేవారి ద్వారానో లేదా తెలిసిన వారిచ్చిన సలహాలతోనో కొందరు ఇంకా మూఢనమ్మకాల వైపు మొగ్గు చూపుతున్నారు.మంత్రాలకు చింతకాయలు రాలవన్న నిజాన్ని గ్రహించక నిండా మోసపోతున్నారు. మన అమాయకత్వమే మోసగాళ్లకు ఆసరా.. మన మూఢ నమ్మకాలే దొంగ బాబాలకు కాసుల జాతర ..ఏఐ యుగంలోను మంత్రాలతో సమస్యలు దూరమవుతాయన్న భ్రమలో ఉన్న కొంతమంది మూఢనమ్మకాలతో మోసపోతున్నారు.ఇలా.. పూజల పేరుతో భయపెట్టి డబ్బులు వసూలు చేసిన నకిలీ బాబా దంపతులను అరెస్టు చేసినట్టు ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. మంగళవారం మావల పోలీస్ స్టేషన్ లో ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. నిందితుడు సలీం సయ్యద్ పూజల ద్వారా కుటుంబ సమస్యలు పరిష్కరిస్తానని బాధితుడిని నమ్మించి ఇంటి వద్ద పూజలు నిర్వహించాడు. అనంతరం బంగారం, వెండి కొనుగోలు చేయించి, మరిన్ని పూజా సామగ్రి అవసరమని చెప్పి యవత్మాల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ భస్మం తదితర పూజా సామగ్రి పేరుతో రూ.81,600 చెల్లింపజేశాడు. అనంతరం మరో 1లక్షా 32వేలు అవసరమని, పూజలు చేయకపోతే కుటుంబ సభ్యుడి ప్రాణానికి ప్రమాదం జరుగుతుందని భయపెట్టాడు.నిందితుల మాటలపై అనుమానం వచ్చిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని ప్రజలను భయపెట్టి డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి సూచించారు. ప్రజలు మూఢనమ్మకాలను విశ్వసించవద్దని ఆదిలాబాద్ డిఎస్పి సూచించారు. ఈ కార్యక్రమంలో మావల సీఐ బి డి ప్రేమ్ కుమార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి కొత్త బస్టాండ్ లోపలకు బస్సుల ప్రవేశం లేక ప్రజల అవస్థలు

- వానకుతడిసి, ఎండకు ఎండుతున్న ప్రజలు
- పాలిటెక్నిక్ విద్యార్థులను పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఎంసిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ ల సంయుక్త డిమాండ్

**బెల్లంపల్లి, మహా :** బెల్లంపల్లి కొత్త బస్టాండ్ లోపలకు బస్సుల ప్రవేశం లేక ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నా అధికారయంత్రాంగం పట్టించుకోకపోవడం, స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే సైతం ఇబ్బందులను తొలగించకపోవడం వారి బాధ్యతరాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నదనీ ఎం సి పి ఐ యు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం రోజు ఎంసీపీఐయు పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎం సిపిఐయు పార్టీ జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి పసలేటి వెంకటేష్ మాట్లాడుతూ బెల్లంపల్లి కొత్త బస్టాండ్ లోపలికి బస్సులు రాక బెల్లంపల్లిలోని ప్రజలు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని బస్సులు రోడ్డు మీద నిలుపుదల చేయడంతో పాలిటెక్నిక్ విద్యార్థులు రోడ్డు దాటే మార్గంలో యాక్సిడెంట్లు అయ్యే ప్రమాదం పొంచి ఉన్నదని అదేవిధంగా వర్షానికి నానుతూ ఎండకు ఎండుతూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నా కానీ ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని వెంటనే ఆసిఫాబాద్ డిపో మేనేజర్,బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి బస్టాండ్ లోపల నిపుణులతో పర్యవేక్షించి ఎలాంటి ప్రమాదాలు సంభవించకుండా చర్యలు తీసుకొని బస్టాండ్ లోపటికి బస్సులు వెళ్లే విధంగా చూడాలని బెల్లంపల్లి పట్టణ ప్రజలకు, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎం సి పి ఐ యు పార్టీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్, బెల్లంపల్లి మండల కార్యదర్శి తోగరి రాహుల్, రాజేష్, శేఖర్ సన్నీ తదితరులు పాల్గొన్నారు.






## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : కలెక్టర్

- నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం
- హాజరైన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి

**ఆదిలాబాద్ మహా :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. నార్నూర్ మండలంలోని బాలన్‌పూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి భవనాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని స్థానిక స్థాయిలోనే పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. నూతన పంచాయతీ భవనాన్ని ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సమర్థవంతంగా వినియోగించుకోవాలని అన్నారు.ఎమ్మెల్యే కోవా లక్ష్మి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడంతో ప్రజలకు పాలన మరింత చేరువ కానుందని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను పంచాయతీ స్థాయిలోనే పరిష్కరించుకోవడానికి ఈ భవనం ఉపయోగపడుతుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ముందుకు సాగాలని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజలింగు, ఎంపీడీవో పుల్లారావు, సర్పంచ్ ఆత్రం సంగీత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని మందమర్రిలోని శ్రీ కామాఖ్య లలిత శ్యామల వారాహి శక్తిపీఠం - కామాఖ్య పీఠం ఆలయంలో కొలువై ఉన్న శ్రీ వారాహి అమ్మవారిని బెల్లంపల్లి ఎమ్మెల్యే మంగళవారం నాడు భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారి దివ్య సన్నిధిలో ఆయన బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సకల శుభాలు కలగాలని ప్రత్యేకంగా ప్రార్థించారు.నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, రైతులకు వ్యవసాయంలో శ్రేయస్సు కలగాలని, కార్మికులు, వృత్తిదారులు, వ్యాపారులు సహా సమస్త ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెంది సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు.బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలకు అన్ని విధాల సౌభాగ్యాలు, సకల సౌకర్యాలు, ఆరోగ్యభాగ్యం ప్రసాదించి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు నడిపించాలని శ్రీ వారాహి అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్,రాష్ట్ర టీబీసీసీ చిలుముల శంకర్, అధికార ప్రతినిధి దేవసాని ఆనంద్, నాయకులు కన్నూరి వెంకటేష్,పట్టణ జనరల్ సెక్రటరీలు దెబ్బేటి రమేష్, బండి రాము,మాజీ కౌన్సిలర్ శంకర్ సింగ్, కాసర్ల యాదగిరి, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.





## రెవెన్యూ శాఖలో అవినీతి భాగోతానికి రాజకీయ "అండనా"?

- విచారణకు జిల్లా ఉన్నతాధికారులు వెనుకంజ?
- మధ్యవర్తుల వసూళ్ల వెనుక 'రాజకీయ' హస్తమా?
- ఉన్నతాధికారుల మౌనం వెనుక అనేక అనుమానాలు
- ఫైళ్లకు రేట్లు నిర్ణయించే పెద్దమనుషులు ఎవరు?



పెద్దపల్లి మహా ; పెద్దపల్లి జిల్లా రెవెన్యూ శాఖలో అవినీతి భాగోతం పై మహా తెలుగు దినపత్రిక లో ప్రచురితమైన కథనాలకు జిల్లా యంత్రాంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.రెవెన్యూ శాఖలో అవినీతి భాగోతం, వసూళ్ల ఆరోపణల పై అధికారులు మాత్రం ఏం తెలియనట్టు ప్రవర్తించడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ అవినీతి భాగోతం పై జిల్లాస్థాయి ఉన్నతాధికారులు ఎటువంటి విచారణ చేపట్టక పోవడం పై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవినీతి ఆరోపణల పై విచారణ ఏది? అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఇంతవరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం పై ప్రజలు మండి పడుతున్నారు. ఇది కేవలం కొందరు అధికారులు, సిబ్బంది, మధ్యవర్తుల వ్యవహారమేనా? లేక వీరి వెనుక కనిపించని రాజకీయ శక్తులు ఎవరైనా ఉన్నారా? అన్న అనుమానాలు ఇప్పుడు బలపడుతున్నాయి. మధ్యవర్తులకు అంత ధైర్యం ఎలా వచ్చింది? సాధారణ ప్రజలు తమ భూ సంబంధిత పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతుంటే.. కొందరు మధ్యవర్తులు మాత్రం కొంతమంది నాయకులు, అధికారుల పేర్లు చెబుతూ వ్యవహారాలు చక్కబెడు తున్నారని విశ్వసనీయ సమాచారం. అధికారుల పేర్లు ఉపయోగించేంత ధైర్యం వారికి ఎవరు ఇచ్చారు? కార్యాలయంలో వారి మాటే ఎందుకు చెల్లుతోంది? ఫైల్ కదలికపై వారికి సమాచారం ఎలా అందుతోంది? వసూళ్ల ఆరోపణలు ఉన్నా వారిపై చర్యలు ఎందుకు కనిపించడం లేదు? ఈ ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. 'రేటు' లేకుండా పని జరగదన్న ఆరోపణలు నిజమేనా? రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సేవలకు నిబంధనలు ఉండాలి. కానీ కొన్ని పనులకు అనధికారికంగా 'రేట్లు' నిర్ణయించి వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే.. ప్రభుత్వ కార్యాలయం ప్రజాసేవా కేంద్రంగా ఉందా? లేక వసూళ్ల అడ్డాగా మారిందా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ ఆరోపణలు నిజమా కాదా అన్నది తేల్చాల్సింది అధికారులే. కానీ విచారణ జరపకుండా మౌనం వహించడం మాత్రం మరిన్ని అనుమానాలకు దారితీస్తోంది. రాజకీయ నాయకుల అండ లేకుండా ఇంత వ్యవస్థ నడుస్తుందా? అన్న అనుమానాలు వ్యక్త మవుతున్నాయి, ఒకరిద్దరు వ్యక్తులు తమంతట తాము ఇలాంటి వ్యవస్థను నడపగలరా? లేక వెనుక నుంచి రాజకీయ అండ, అధికార పలుకుబడి, ప్రభావశీలుల రక్షణ ఉందా? ఇదే ఇప్పుడు అసలు ప్రశ్న. రాజకీయ జోక్యం లేదంటే సమగ్ర విచారణ జరిపించి ఆ అనుమానాలకు తెరదించవచ్చు. ఈ ఆరోపణల పై ఇంతవరకు జిల్లా స్థాయి అధికారులు విచారణకు ఎందుకు వెనుకంజ వేస్తున్నారు! విచారణ జరిగితే బయటపడేది ఎవరి పేర్లు? కార్యాలయంలోని ఫైళ్లను, దరఖాస్తుల పరిష్కార తీరును, మధ్యవర్తుల కదలికలను, ప్రజల ఫిర్యాదులను సమగ్రంగా పరిశీలిస్తే అసలు వ్యవహారం బయటపడే అవకాశం ఉంది. అందుకే విచారణకు భయమా? లేక విచారణ జరిగితే కొందరి 'పెద్దల' పేర్లు బయటపడతాయనే భయమా? ఈ అనుమానాలకు జిల్లా ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి. ఇక మౌనం చాలదంటున్న ప్రజలు సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ప్రభుత్వ కార్యాలయంలో పారదర్శకత కోరడం తప్పా? తమ పని కోసం లంచం ఇవ్వాల్సిన పరిస్థితి లేదని ప్రభుత్వం భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదా? ఇకనైనా ఉన్నతాధికారులు మేల్కొని సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో నడుస్తున్నదేమిటి? ప్రజాసేవ ముసుగులో అవినీతి వ్యవస్థను నడుపుతున్న మధ్యవర్తులు ఎవరు? వీరికి రాజకీయ అండ దండలు ఉన్నాయా? అన్న ఈ ప్రశ్నలకు ఉన్నతాధికారులు ఏం సమాధానం చెబుతారని బాధితులతో పాటు జిల్లా ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి రెవెన్యూ శాఖలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపించాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు.



## వైభవంగా విశ్వకర్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఘనంగా విశ్వకర్మ పతాక ఆవిష్కరణ, బైక్ ర్యాలీ

**కరీంనగర్ మహా :** శ్రీ మద్విరాట్ విశ్వకర్మ భగవానుడి బ్రహ్మోత్సవాలు కరీంనగర్‌లో మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ గాయత్రీ విశ్వకర్మ సహిత శ్రీశ్రీ శ్రీ గోవిందమాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న మూడు రోజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, యాగశాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఉదయం సుప్రభాత సేవ, వేదపారాయణంతో ప్రారంభమైన కార్యక్రమాల్లో మూల విరాట్లకు ఫల, పంచామృత అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అనంతరం మహాగణపతి పూజ, స్వస్తిపుణ్యాహవాచనం, దీక్షా కంకణధారణ, అఖండ దీపస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ విశ్వకర్మ పతాకాన్ని ఆవిష్కరించారు. పతాక ఆవిష్కరణ అనంతరం భక్తులు, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ పెద్ద ఎత్తున జరిగింది ఈ కార్యక్రమంలో భక్తులు విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గోపూజ, యాగశాల, వేదికా ప్రవేశం, అంకురార్పణ, ఋత్విక్వరణం, ప్రధాన కలశస్థాపన, మండపారాధన, అగ్నిప్రతిష్ఠ తదితర వైదిక కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడు విశ్వసృష్టికి ఆధారభూతుడని, సకల వృత్తులు, కళలు, శిల్పాలకు ఆద్యుడిగా భక్తులచే ఆరాధించబడుతున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక అభిషేకాలు, లక్షపుష్పార్చన, సహస్ర దీపాలంకరణ సేవ, ప్రవచనాలు, మంగళహారతి, తీర్థప్రసాద వితరణ నిర్వహించనున్నారు. అనంతరం కట్ట వాణి బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ముత్తోజు రామ్‌కుమార్, ధర్మకర్తలు గోకులకొండ నర్సింహాచారి, రాగటి కవిత, ఎదులాపురం మహేష్, గోగులకొండ కరుణాకర్, వెగ్గళం రామకృష్ణ, వంగల నవీన్ జిల్లా స్వర్ణకార సంఘం నాయకులు కట్ట జగన్, ఆలయ సిబ్బంది, హరేరామ హరేకృష్ణ భజన మండలి సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన వారిని గుర్తించాలి

- **బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్పర్సన్ మతమార్ సూరిబాబు అండ్ రాష్ట్ర టి పి సి ప్రచార కమిటీ కన్వీనర్ నాతరిస్వామి**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ఎమ్మెల్యే గెలుపునకు కృషి చేసిన వారిని గుర్తించి సరైన స్థానం కల్పించాలని బెల్లంపల్లి మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ మత్తమర్ సూరిబాబు తో పాటు రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి లు సంయుక్తంగా వెల్లడించారు. మంగళవారం రోజున బెల్లంపల్లి నియోజకవర్గం బెల్లంపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం బెల్లంపల్లి పార్టీ కార్యాలయంలో సీనియర్ నాయకులు మత్తమరి సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించగా బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గడ్డం వినోద్ గెలవడం కోసం అహర్నిశలు కష్టపడ్డ నాయకులు కార్యకర్తలను పట్టించుకోకుండా వలస వాదులకు ప్రాముఖ్యత ఇస్తూ కాంగ్రెస్ పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారనీ, రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి చాలా నష్టం కలుగుతుంది ఇప్పటికైనా ఎమ్మెల్యే నిజమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలను కలుపుకొని ప్రజల కోసం పనిచేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.సీనియర్ నాయకులను కార్యకర్తలను గుర్తించి వారికి సముచిత స్థానాలు కల్పించాలని అన్నారు. బెల్లంపల్లిలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలంటే ఎమ్మెల్యే అందర్నీ కలుపుకొని పనిచేయాలనీ లేనిపక్షంలో ఎమ్మెల్యేపై అధిష్టానంనకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడుఅబ్జల్, మునిమంద రమేష్, నయూం బాయ్, రొడ్డ శ్యామ్, ఎండి గౌస్ భాయ్ ,జక్కుల శ్రీధర్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిప్ప మనోహర్, మాజీ కౌన్సిలర్ బొడ్డు నారాయణ, మాజీ ఫ్లోర్ లీడర్ కటకం సతీష్, సిలివేరి సత్యనారాయణ, సూరం బానేష్, మేకల శ్రీనివాస్, మత్తమారి సత్తిబాబు, మంగమూర్తి, దాసరి సంజీవ్, మతమారి జగన్, బైరి శ్రీనివాస్, మతమారి శ్రీనివాస్, రాజబ్రహ్మం, గడ్డం అశోక్ ,కళ్యాణం పోషం ,అజీమ్ భాయ్, ఎండి రహీం, హరీష్ పాండే, బబ్లు భాయ్, ఆర్ఎం సింగ్ ఆడియో ,నక్క కృష్ణ ,రాజారత్నం, జీలకర వాసు, సబ్బని రాజనర్సు, టిఎల్ చారి, జంజరాల మనోహర్, కుమ్మరి శంకర్, జూపాక లక్ష్మీనారాయణ, మల్లేష్ ,బాబురావు ,సోగాల రవి ,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.




## ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీర్లకు ఘన సన్మానం

- **లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వేడుకలు**
- **హాజరైన మణుగూరు సీఐ నాగబాబు**

**మణుగూరు, మహా :** భారతరత్న సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీర్స్ డే వేడుకలను లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డీవీ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొబ్బల వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మణుగూరు ఎస్ హెచ్ ఓ పి నాగబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో సేవలందిస్తున్న ఇంజనీర్లను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీతల్లో ఇరిగేషన్ డీఈ బి రమేష్‌బాబు, ఎలక్ట్రికల్ ఏఈ డి ఉమామహేశ్వరరావు, ఎలక్ట్రికల్ సబ్ ఇంజనీర్ ఎం లారెన్స్, బీటీపీఎస్ ఏడీఈ అంజుమర బేగం, మణుగూరు మున్సిపాలిటీకి చెందిన కెవి కోటేశ్వరరావు ఉన్నారు. దేశ నిర్మాణం, పారిశ్రామిక అభివృద్ధి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఇంజనీర్ల పాత్ర ఎంతో కీలకమని వక్తలు పేర్కొన్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య దేశానికి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో కత్తి రాము, గాజుల రమేష్‌కుమార్, కముజు చంద్రమోహన్, మొత్తం శెట్టి నాగేశ్వరరావు, డాక్టర్ సమ్మయ్య, గాజుల పూర్ణచంద్రరావు, అడబాల నాగేశ్వరరావు, ఎం. యాదగిరి, మగువ క్లబ్ అధ్యక్షురాలు వన్నం నాగదేవి, ట్రెజరర్ ఎం. లక్ష్మితో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు, లయన్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



## సాగు సమస్యలపై పోరాటాల రూప శిల్పి సారంపల్లి మల్లారెడ్డి

**కారేపల్లి, మహ :** సాగు సమస్యలపై నిరంతరం అధ్యాయనం చేస్తూ వాటి పరిష్కారం కోసం అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడు అమరజీవి సారంపల్లి మల్లారెడ్డి పోరాటాల ప్రణాళికను రూపొందించే వారని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు అన్నారు. మంగళవారం కారేపల్లిలో సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. మల్లారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసిని నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ సాగునీటి రంగ సమస్యలు, రైతాంగ ఉద్యమాలపై అనేక రచనలు చేసి పోరాటాలకు దిక్సూచిగా మారరన్నారు. విత్తన రంగంపై బహుళజాతి సంస్థల పెత్తనానికి, బిటి పత్తిపై మాన్‌శాంటో కంపెనీ ఆధిపత్యానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని చైతన్యం చేశారన్నారు. రైతాంగం, కష్టజీవుల స్థితి గతులను క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపిన పేదల అభివృద్ధికి జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగారై తాంగ సమస్యలపై నిరంతర పోరాటాలతో పరిష్కారమార్గం చూపటమే ఆయనకు ఇచ్చేనివాళ్లు ఆనిఅన్నారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, ఇంజం నాగభూషణం, వైరా డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు వజ్జా రామారావు, నాయకులు పాపినేని నాగేశ్వరరావు, కరపటి సీతారాములు, ఎస్.కె.సైదులు, పిప్పాల కృష్ణ, బారు నర్సింహరావు పాల్గొన్నారు.

# ఓరుగల్లులో విభిన్న రూపాల్లో కొలువుదీరిన గణనాథులు

- **విశిష్ట పూజలు అందుకుంటున్న గణపయ్యలు**
- **నగరంలో జోరుగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు**





**వరంగల్, బ్యూరో మహా ;** గ్రేటర్ వరంగల్ నగరం మొత్తం గణపతి మండపాలతో నిండిపోయాయి. ఈసారి నగరంలో విభిన్న రూపాలతో గణపతులు గణేష్ నవరాత్రులు ఓరుగల్లులో కొత్త రికార్డు సృష్టిస్తున్నాయి. ప్రతి గల్లీలో ఒక ప్రత్యేకత, ప్రతి మండపంలో ఒక వినూత్నత కనిపిస్తోంది. భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్న 5 ప్రత్యేక గణపతుల పై మహా తెలుగు దినపత్రిక స్పెషల్ ఫోకస్...

వరంగల్ నగరం చౌరస్తా లోని డాల్ఫిన్ గల్లీలో పత్తి వినాయకుడు వరంగల్ లోనే ఫేమస్ అయిన డాల్ఫిన్ గల్లీ యువత ఈసారి వినూత్నంగా ఆలోచించింది. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కు స్వస్తి పలికి, స్వచ్ఛమైన పత్తి, మట్టి, గోమయంతో 9 అడుగుల గణపతిని తయారు చేశారు. పూర్తిగా కాలుష్య రహితం. నిమజ్జనం తర్వాత పత్తి రైతుకు ఉపయోగపడేలా ప్లాన్ చేశారు. పర్యావరణాన్ని కాపాడుకోవడమే నిజమైన పూజ అంటున్నారు నిర్వాహకులు. అలాగే గీతా మందిర్ ఎదురుగా 4500 చీరలతో వినూత్న గణపతి కొలువు తీరాడు. గీతా మందిర్ ఎదురుగా ఏర్పాటు చేసిన గణపతి మండపం ఈసారి జిల్లా వ్యాప్తంగా వైరల్ అవుతోంది. 4500 రంగు రంగుల చీరలతో వినాయకున్ని మండపాన్ని అలంకరణ చేసి ఈ అద్భుతం సృష్టించారు. ఇది కేవలం అలంకరణ కాదు, సేవా కార్యక్రమం అని అందరూ ప్రశంసిస్తున్నారు.హైదరాబాద్ తర్వాత ఎల్లం బజార్ లో 51 అడుగుల భారీ గణపతి విగ్రహం ఎల్లం బజార్ వ్యాపారస్తులు ఈసారి భారీ గణపతిని ఏర్పాటు చేశారు. 51 అడుగుల ఎత్తుతో నగరంలోనే అతిపెద్ద గణపతిగా రికార్డు ను సొంతం చేసుకుంది. హైదరాబాద్ ఖైరతాబాద్ గణపతిని తలపించేలా భారీ విగ్రహం, లైటింగ్, పూల అలంకరణ. దర్శనానికి చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. రాత్రిపూట లైటింగ్ లో ఈ గణపతిని చూడటానికి రెండు కళ్ళు చాలవు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో సత్యం కంప్యూటర్స్ లో కమలంలో లక్ష్మీ గణపతి విద్యార్థులను ప్రత్యేకంగా ఆకర్షించింది. వరంగల్ జేపియన్ రోడ్ చౌరస్తాలోని సత్యం కంప్యూటర్స్ వద్ద ఏర్పాటు చేసిన గణపతి విద్యార్థులు, ఉద్యోగార్థులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెద్ద కమలం పువ్వులో కూర్చున్న గణపతి రూపం ఒక చేతిలో పుస్తకం, ఒక చేతిలో లక్ష్మీదేవి ఆశీస్సులు. చదువు, ఐశ్వర్యం రెండూ ఇచ్చే గణపతిగా భక్తులు కొలుస్తున్నారు. గత కొన్ని ఏళ్లు గా పోచమ్మ మైదాన్ దేశాయ్ పేట్ రోడ్డు వర్తక సంఘం వారు భారీ గణనాథుడిని ప్రతిష్టిస్తున్నారు. వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు డాక్టర్ లయన్ ఆడపు రవీందర్ ఆధ్వర్యంలో పోచమ్మ మైదాన్, దేశాయ్ పేట్ రోడ్డులో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు ఈ ప్రాంతానికే తలమానికంగా నిలిచాడు. ఈ విగ్రహానికి రోజూ విశేష పూజలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు. డాక్టర్ రవీందర్, దాతల సహకారంతో ప్రతిరోజూ 500 మందికి పైగా అన్నప్రసాద వితరణ, సాయంత్రం అల్పాహారం కార్యక్రమాలు నిర్వహించడం విశేషం. వ్యాపారులంతా ఏకమై భక్తితో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**అన్నదానాల జోరు, పూజల హోరు**

నగరవ్యాప్తంగా ప్రతి మండపంలో ఉదయం గణపతి అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కోలాటం, భజనలు, డప్పు వాయిద్యాలతో హోరెత్తిస్తున్నారు. వరంగల్ నగర వ్యాప్తంగా ఏర్పాటుచేసిన ఈ మండపాల పై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు.



## జేఆర్ ఫ్రెండ్స్ వినాయకుని దర్శించుకున్న మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్

**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 15 మహా:** జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని, సందర్శించిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్, లంబోదరునికి దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి స్వామివారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటుచేసిన మండపాల నిర్వాహకులకు కమిషనర్ పలు సూచనలు చేశారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంతం వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో, పర్యావరణాన్ని కాపాడుతూ, పరిసరాల్లో పరిశుభ్రతను కాపాడాలని, జేఆర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ నిర్వాహకులకు కమిషనర్ సూచించారు. ప్రజలందరూ సుభిక్షంగా ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో సంతోషంగా ఉండాలని, ఆ యొక్క గణనాథుని కోరినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దారు రాఘవేంద్ర రావు, ఆకుల మహేష్, మడపు శివసాయి, కొత్త గణేష్ గౌడ్, కోరా ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కరువు పరిస్థితుల నుండి రైతును కాపాడాలి

- **చెరువులు నిండక బీడువారిన పోలాలు**
- **నిషేధిత జాబితాలో పేదలభూములు**

**కారేపల్లి, మహ :** ఎల్ నినో ప్రభావం మూలంగా వచ్చిన కరువు పరిస్థితులతో రైతు సాగుకు సాగటం లేదని కురువు నుండి రైతును ఆదుకోవటానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు కోరారు. రైతు సంఘం మండలకమిటీ సమావేశం మంగళవారం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బొంతు రాంబాబు మాట్లాడుతూ తీవ్ర నీటి ఎద్దటితో చెరువునిండక పోవటంతో పోలాలు బీడు వారాయన్నారు. కరువు పరిస్థితులలో రైతలనుఆదుకోవల్సిన బాధ్యత ప్రభుత్వమైనే ఉందన్నారు. ప్రస్తుత శాసన సభ సమావేశాలలో కరువు పరిస్థితులపై చర్చించి. ఎకరాకు రూ.20 వేల పరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి, కామేపల్లి మండలాల రైతులు వర్షాధార చెరువులే తప్ప ఎలాంటి సాగు వనరులులేవన్నారు. సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇస్తామని పాలకులు ఊరిస్తున్నారు తప్ప నీళ్లురప్పించటానికి నిధులు కెటాయింపులు జరపటం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే వెంటనే నిధులు కెటాయించి సింగరేణి, కామేపల్లి మండలాల సాగు నీటి సమస్యనుతీర్చాలన్నారు. ఏజన్సీమండలాలలో గిరిజన,గిరిజనేతపేద రైతులు భూములున్నా పట్టాలుకాని వారు 30శాతం మంది ఉన్నారన్నారు. వీరికి ప్రభుత్వ పరంగా ఎలాంటి సాయం అందకపోగా ఎరువులు తెచ్చుకోవటానికి కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా, ఇతర ఎరువులకోసం సుబాబుల్, జామాయిల్ వేసినరైతులను బ్రతిమిలాడుకోవల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. ఎరువుల యాఫ్ తో రైతులను ఇబ్బందులకు గురి చేయటమే తప్ప ప్రభుత్వానికి ఆదనంగావచ్చిన ప్రయోజనం ఏమిటో అర్ధం కావటం లేదన్నారు. సింగరేణి మండంలో రేలకాయలపల్లి, బాజుమల్లాయిగూడెం, మాణిక్యారం, కోమట్లగూడెం, ఉసిరికాయలపల్లి రెవిన్యూ గ్రామాలలో పేద రైతుల భూములు నిషేధిత జాబితాలో చోటుచేసుకొని ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిషేధిత జాబితా భూములున్నరైతులకు బ్యాంకు రుణాల దగ్గర నుండి అవసరానికి అమ్మటానికి వీలు లేని పరిస్థితి ఉందన్నారు. చట్ట సభలలో నిషేధిత భూములపై ఆరోపణలు, ప్రత్యారోపణలు తప్ప ప్రజల సమస్యలపై చర్చించే తీరిక లేకుండా పోయిందన్నారు. రైతాంగ సమస్యలపై దశలవారి ఉద్యమాలు నిర్వహించనున్నట్లుతెలిపారు. ఈకార్యక్రమంలోరైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గి కృష్ణ, ఇంజం నాగభూషణం, మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు పాపినేని నాగేశ్వరరావు, కరపటి సీతారాములు, ఎస్.కె.సైదులు, పిప్పాల కృష్ణ, బారు నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- **కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి,జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్**

**హనుమకొండ, మహా ;** కుడా పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు వేగవంతం కావాలని కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి అన్నారు . మంగళవారం కుడా కార్యాలయం లో అభివృద్ధి పనుల పురోగతి మీద సంబంధిత అధికారులతో కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్ పర్సన్ చాహత్ బాజ్ పాయి రివ్యూ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కుడా పరిధిలో చేపట్టిన వరంగల్ బస్ స్టేషన్, ఇన్నర్ రింగ్ రోడ్, వేయి స్తంభాల గుడి అభివృద్ధి పనులు, ఉనికి చర్ల, హన్మకొండ చౌరస్తా రీ డెవలప్మెంట్ , ఔటర్ రింగ్ రోడ్, నేషనల్ హైవే గ్రీనరి మొదలగు పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. భూ సేకరణ చేయాల్సి ఉన్న అభివృద్ధి పనులకు సంబందించిన ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో కుడా పి ఓ అజిత్ రెడ్డి, ఈ ఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అల్పాహార కార్యక్రమం ప్రారంభం

- **సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ప్రతిష్టాత్మక కార్యక్రమానికి శ్రీకారం**

**పెద్దపల్లి మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార కార్యక్రమాన్ని పెద్దపల్లి నియోజకవర్గంలోని కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమానికి పెద్దపల్లి నియోజకవర్గ విప్, ఎమ్మెల్యే విజయరమణా రావు హాజరై అల్పాహార పంపిణీని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థుల ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించగలరని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అల్పాహార కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే అల్పాహారాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఎమ్మార్వో రాముడు, శ్రీరాంపూర్ సర్పంచ్ బంగారి రమేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, గోప గోని సారయ్య గౌడ్,మొట్లపల్లి నుండి కాంగ్రెస్ కార్యకర్తలు మల్లమ్మ, అనుముల రాంప్రసాద్, బొమ్మ ఎల్లయ్య, శ్రీపతి స్వామి, అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు,ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ధాన్యం తరలింపు ప్రక్రియ పకడ్బందీగా ఉండాలి

**హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి**

హనుమకొండ, మహా ; ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ పకడ్బందీగా ఉండేలా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి పౌర సరఫరాలు, సహకార శాఖల అధికారులు, ధాన్యం కొనుగోలు కాంట్రాక్టర్లను ఆదేశించారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన దాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లులకు తరలింపు ప్రక్రియ పై జిల్లా పౌర సరఫరాల శాఖ, ధాన్యం కాంట్రాక్టర్లతో సమావేశాన్ని అదనపు కలెక్టర్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం తరలించే వాహనాలకు తప్పనిసరిగా జీపీఎస్ ను ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం తరలింపులో ఎక్కడ కూడా ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. స్టోరేజ్ పాయింట్లలో ధాన్యం నిల్వ అవసరాలకు ఉపయోగపడే స్థలాలను సిద్ధంగా ఉండేలా చూసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. సీజన్ లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. వాహనాల డ్రైవర్ల సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపయోగంలో లేని ఫంక్షన్ హాళ్లు, సినిమా హాళ్ళను స్టోరేజ్ పాయింట్లుగా వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మహేందర్, జిల్లా సహకార అధికారి మోహన్, సివిల్ సప్లై డీటీలు భద్రు నాయక్, నాగేంద్ర ప్రసాద్, భాస్కర్ రెడ్డి, ధాన్యం కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



## దేశాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర అత్యంత కీలకం

**వరంగల్, కలెక్టరేట్ మహా;** జాతీయ ఇంజినీర్స్ డే సందర్భంగా జిల్లాలోని ఇంజినీర్లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలకమని ఆమె పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఆధునిక సేవలు అందించడంలో ఇంజినీర్లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. భారతదేశ ప్రఖ్యాత ఇంజినీర్, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని వారి విగ్రహానికి పూల మాల సమర్పించి ఘనంగా వారి జయంతిని నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ తో పాటు సంబధిత జిల్లా ఇంజినీర్లు పాల్గొన్నారు.



## 32 అడుగుల భారీ వినాయకుడు

**పెద్దపల్లి, మహా:** వినాయక చవితి సందర్భంగా ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో పెద్దపల్లి జిల్లాలో 32 అడుగుల భారీ వినాయక విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలతో గణనాథుడికి స్వాగతం పలికారు. ఆకర్షణీయమైన అలంకరణలతో ఉన్న విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా తాగునీరు, క్యూలైన్లు తదితర ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



మహా పత్రిక





# రాజసంగా మెరిసిన దిశా పటానీ

బాలీవుడ్ అందాల భామ దిశా పటానీ మరోసారి తన గ్లామర్‌తో అభిమానులను ఆకట్టుకుంది. గాఢమైన క్రిమ్సన్ ఎరుపు రంగు లెహంగాలో రాజసంగా మెరిసిన ఆమె లుక్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వెండి రంగు సున్నితమైన ఎంబ్రాయిడరీతో అలంకరించిన లెహంగాకు, అందంగా డిజైన్ చేసిన స్వీట్‌హార్ట్ నెక్‌లైన్ చోలీని జత చేసింది. మెడలో భారీగా కనిపించే గోల్డ్ కుందన్ ఆభరణాలు ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేశాయి. అలలుగా వదిలిన జుట్టు, ఆకర్షణీయమైన చూపులతో దిశా తన స్టైల్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. దిశా పటానీ సినీ ప్రయాణం తెలుగు చిత్రంతోనే ప్రారంభమైంది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లోఫర్' సినిమాతో 2015లో కథానాయికగా వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టి 'ఎం.ఎస్. ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ'లో నటించింది. 2016లో విడుదలైన ఈ చిత్రం ఆమెకు దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు తీసుకొచ్చింది. ఈ సినిమాతోనే ఐఐఎఫ్ఏ అవార్డుల్లో 'స్టార్ డెబ్యూ ఆఫ్ ది ఇయర్' పురస్కారాన్ని అందుకుంది. తర్వాత 'కుంగ్ ఫూ యోగా', 'బాఘీ 2', 'మలంగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా యాక్షన్, గ్లామర్ పాత్రల్లో దిశా తనదైన శైలిని ప్రదర్శిస్తూ యువతలో భారీ క్రేజ్ సంపాదించుకుంది. అంతర్జాతీయ స్థాయిలో తెరకెక్కిన 'కుంగ్ ఫూ యోగా'తో పాటు 'బాఘీ 2' వంటి కమర్షియల్ హిట్స్ ఆమె కెరీర్‌కు మరింత బలాన్ని ఇచ్చాయి. ఇటీవల ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏడీ' వంటి పాన్ ఇండియా చిత్రంలో భాగమై దిశా తన పరిధిని మరింత విస్తరించింది. భారీ బడ్జెట్ చిత్రాలు, మల్టీస్టారర్ సినిమాలు, పాన్ ఇండియా ప్రాజెక్టుల్లో వరుస అవకాశాలు అందుకుంటూ ముందుకు సాగుతోంది. నటనతో పాటు ఫ్యాషన్, గ్లామర్ విషయంలోనూ ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని చూపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా క్రిమ్సన్ లెహంగాలో కనిపించిన ఆమె లుక్‌కు నెటిజన్ల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.





# ఒకే గదిలో మరోసారి శ్రీకాంత్ ఓదెల

**మహా:** దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినీ ప్రయాణంలో ఆసక్తికరమైన మలుపు చోటుచేసుకుంది. ఒకప్పుడు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తూ సినిమా పాఠాలు నేర్చుకున్న ప్రదేశంలోనే ఇప్పుడు దర్శకుడిగా కూర్చోవడం ఆయనకు ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తోంది. ఈ విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో శ్రీకాంత్ స్వయంగా గుర్తుచేసుకున్నారు.దర్శకుడు సుకుమార్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా శ్రీకాంత్ ఓదెల పనిచేశారు. ముఖ్యంగా 'రంగస్థలం' సినిమా సమయంలో సుకుమార్ పనిచేసిన ఆఫీస్, గది ఆయనకు ఎన్నో జ్ఞాపకాలను మిగిల్చాయి. అప్పట్లో దర్శకుడి బృందంలో భాగంగా అక్కడ పని చేసిన శ్రీకాంత్.. ఇప్పుడు అదే ప్రదేశంలో దర్శకుడి హోదాలో తన పనిని కొనసాగిస్తున్నారు. ఈ మార్పు తన జీవితంలో ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు. దర్శకుడిగా తనకు సొంతంగా ఆ గది లభించిన తొలినాళ్లలో అక్కడ కూర్చోవడంపై కూడా కొంత సంకోచం ఉండేదని శ్రీకాంత్ చెప్పారు. గతంతో ఉన్న అనుబంధం, ఆ ప్రదేశంపై ఉన్న గౌరవం కారణంగా మొదట్లో భిన్నమైన భావనలు కలిగాయని, ఆ తర్వాత నెమ్మదిగా ఆ వాతావరణానికి అలవాటు పడ్డానని వివరించారు. సుకుమార్ వద్ద పనిచేసి అనుభవం సంపాదించిన శ్రీకాంత్ ఓదెల.. నానితో 'దసరా' చిత్రంతో దర్శకుడిగా పరిచయమయ్యారు. తొలి సినిమాతోనే మాస్ ట్రీట్‌మెంట్‌తో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ప్రస్తుతం నానితో కలిసి 'ది ప్యారడైజ్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది.అసిస్టెంట్ డైరెక్టర్‌గా సినిమా నేర్చుకున్న అదే ప్రదేశంలో ఇప్పుడు దర్శకుడిగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి చేరుకోవడం శ్రీకాంత్ ఓదెల కెరీర్‌లో చెప్పుకోదగ్గ పరిణామంగా నిలిచింది. గతంలో తనకు పాఠాలు నేర్పిన వాతావరణమే ప్రస్తుతం తన సృజనాత్మక ప్రయాణానికి వేదిక కావడం ఆయన సినీ జీవితంలోని నిజమైన 'ఫుల్ సర్కిల్' క్షణంగా చెప్పవచ్చు.





# రాజమౌళి ప్లానింగ్‌కు మహేష్ ఫిదా!

**మహా:** సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'వారణాసి' చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేష్‌కు జోడీగా ప్రియాంక చోప్రా జోనస్ నటిస్తుండగా.. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. యాక్షన్, అడ్వెంచర్ అంశాలతో రూపొందుతున్న ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. సినిమా గురించి చిత్రబృందం పలు సందర్భాల్లో ఆసక్తికర విషయాలను వెల్లడిస్తోంది. తాజాగా ఓ విదేశీ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మహేష్ బాబు.. రాజమౌళితో తన పరిచయం, ఈ ప్రాజెక్ట్ వరకు వచ్చిన ప్రయాణం గురించి మాట్లాడారు. రాజమౌళిని చాలా ఏళ్ల క్రితమే కలిశానని, అప్పుడే ఆయనతో సినిమా చేయాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు చెప్పారు.'మగధీర' విడుదలైన తర్వాత రాజమౌళిని కలిసిన సందర్భాన్ని మహేష్ గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తనకు మరో రెండు సినిమాలు చేయాల్సి ఉందని, అవి పూర్తయ్యాక కలిసి సినిమా చేద్దామని రాజమౌళి చెప్పారట. అయితే ఆ రెండు సినిమాలు పూర్తయ్యేలోపు అనూహ్యంగా చాలా సంవత్సరాలు గడిచిపోయాయని మహేష్ సరదాగా పేర్కొన్నారు. చివరకు ఇన్నేళ్ల తర్వాత ఇద్దరి కలయికలో భారీ ప్రాజెక్ట్ రూపొందుతుండటం ఆనందంగా ఉందన్నారు.రాజమౌళి దర్శకత్వంలో పనిచేయడం ఎలా ఉందన్న ప్రశ్నకు కూడా మహేష్ ఆసక్తికరంగా స్పందించారు. రాజమౌళి సెట్స్‌లో నటీనటులను చాలా కష్టపెడతారని కొందరు తనకు ముందుగానే చెప్పారని తెలిపారు. అయితే తాను మాత్రం షూటింగ్‌లో అలాంటి ఒత్తిడిని అనుభవించలేదన్నారు.రాజమౌళి ముందస్తు ప్రణాళిక, రిహార్సల్స్, ప్రతి సన్నివేశంపై స్పష్టమైన అవగాహనతో పనిచేయడం వల్ల షూటింగ్ ప్రక్రియ మరింత క్రమబద్ధంగా సాగుతోందని మహేష్ చెప్పారు. దర్శకుడి విధానానికి తాను కూడా పూర్తిగా అలవాటు పడిపోయానని తెలిపారు. భవిష్యత్‌లో ఇతర దర్శకులతో పనిచేసేటప్పుడు రాజమౌళి స్టైల్‌కు భిన్నమైన పని విధానం తనకు కొత్తగా అనిపించవచ్చని సరదాగా వ్యాఖ్యానించారు.మహేష్ బాబు, రాజమౌళి తొలిసారి కలిసి చేస్తున్న సినిమా కావడంతో 'వారణాసి'పై దేశీయంగానే కాకుండా అంతర్జాతీయంగానూ ఆసక్తి పెరుగుతోంది. ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి.



# కత్తి పట్టిన కమలారెడ్డి.. రమ్యకృష్ణ విశ్వరూపం!



**మహా:** కొన్ని పాత్రలు నటీనటుల కెరీర్‌లో ప్రత్యేక ముద్ర వేస్తాయి. అలాంటి పాత్రలను పోషించినప్పుడు నటీనటుల పేర్ల కంటే ముందుగా ఆ క్యారెక్టర్లే ప్రేక్షకుల మదిలో నిలిచిపోతాయి. అలాంటి అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్న నటి రమ్యకృష్ణ. హీరోయిన్‌గా ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో నటించిన ఆమె.. 'నరసింహ'లోని నీలాంబరి, 'బాహుబలి'లోని శివగామి వంటి విభిన్నమైన పాత్రలతో తన నటనా స్థాయిని మరో మెట్టుకు తీసుకెళ్లారు. రజనీకాంత్‌తో పోటీపడే స్థాయిలో నీలాంబరి పాత్రకు బలమైన ప్రతినాయక ఛాయలను తీసుకొచ్చిన రమ్యకృష్ణ.. 'బాహుబలి'లో శివగామిగా పూర్తిగా భిన్నమైన కోణాన్ని ఆవిష్కరించారు. రాజసం, గంభీరత, భావోద్వేగాలను కలగలిపిన ఆ పాత్ర ఆమె కెరీర్‌లో చిరస్థాయిగా నిలిచిపోయింది.ఇప్పుడు మరో శక్తివంతమైన పాత్రతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రమ్యకృష్ణ సిద్ధమవుతున్నారు. 'డేవిడ్ రెడ్డి' సినిమాలో ఆమె కమలారెడ్డి పాత్రలో కనిపించనున్నారు. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఈ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. పోస్టర్‌లో కత్తి చేతపట్టుకుని తిరుగుబాటు యోధురాలిగా కనిపిస్తున్న ఆమె లుక్ ఆసక్తిని రేకెత్తిస్తోంది.బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తిరుగుబాటుదారుడు డేవిడ్ రెడ్డి కథను ప్రధానంగా చేసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కమలారెడ్డి పాత్ర కూడా పోరాట పటిమ, ధైర్యసాహసాలతో సాగనున్నట్లు ఫస్ట్‌లుక్‌ను బట్టి అర్థమవుతోంది. రమ్యకృష్ణ పాత్ర సినిమాలో కీలకమైన మలుపులకు కారణమవుతుందని చిత్రబృందం నమ్మకంగా ఉంది.ఇప్పటికే 'డేవిడ్ రెడ్డి' టీజర్ ప్రేక్షకుల నుంచి మంచి స్పందన అందుకుంది. కొంతకాలంగా సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్స్ లేకపోయినప్పటికీ.. రమ్యకృష్ణ పాత్రను పరిచయం చేస్తూ విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌తో సినిమాపై మళ్లీ ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా రమ్యకృష్ణ అభిమానులు ఈ పాత్ర ఎలా ఉండబోతుందనే విషయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ సినిమాలో రమ్యకృష్ణతో పాటు సముద్రఖని కూడా కీలక పాత్రలో కనిపించనున్నారు. కథకు బలమైన పాత్రలు తోడవుతుండటంతో 'డేవిడ్ రెడ్డి'పై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. కమలారెడ్డి పాత్ర రమ్యకృష్ణ కెరీర్‌లో మరో గుర్తుండిపోయే క్యారెక్టర్‌గా నిలుస్తుందా అనేది సినిమా విడుదల తర్వాతే తేలనుంది.

# 17 రోజుల్లో 100 మిలియన్లు!

హైదరాబాద్, మహా: నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ది ప్యారడైజ్' సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ చిత్రంలోని 'ఏష నాగుల' పాట విడుదలైన కొద్దిరోజుల్లోనే భారీ ఆదరణ సొంతం చేసుకుంది. తాజాగా యూట్యూబ్‌లో 100 మిలియన్ల వ్యూస్ మార్క్‌ను అధిగమించి సరికొత్త రికార్డు సృష్టించింది.పాటకు అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఫోక్ టచ్‌తో రూపొందించిన బీట్‌కు జంగిరెడ్డి, ప్రభా బంగారిగళ్ల గాత్రం ప్రత్యేకమైన మాస్ ఫీల్‌ను తీసుకొచ్చింది. పాట విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలోనూ దీనికి సంబంధించిన రీల్స్, వీడియోలు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.'దసరా' తర్వాత నాని, కీర్తి సురేష్ కలిసి కనిపించిన ఈ ప్రత్యేక గీతంలోని విజువల్స్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆట సందీప్ కొరియోగ్రఫీలో రూపొందిన మాస్ స్టెప్పులు పాటకు మరింత క్రేజ్ తీసుకొచ్చాయి. దీంతో విడుదలైన 17 రోజుల్లోనే 100 మిలియన్ల వ్యూస్ చేరుకోవడం విశేషంగా మారింది.గతంలో 'పుష్ప'లోని 'ఊ అంటావా మావా', 'దేవర'లోని 'చుట్టమల్లె', 'అల వైకుంఠపురములో'లోని 'బుట్టబొమ్మ' వంటి పాటలు కూడా యూట్యూబ్‌లో భారీ ఆదరణ పొందాయి. అయితే 'ఏష నాగుల' తక్కువ సమయంలోనే 100 మిలియన్ల మార్క్‌ను చేరుకోవడంతో ఈ పాటపై చర్చ మరింత పెరిగింది.ఇక 'ది ప్యారడైజ్' విషయంలో మేకర్స్ మరో ఆసక్తికర నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. థియేట్రికల్ ట్రైలర్ విడుదల చేయకుండానే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన టీజర్‌తో పాటు 'ఆయా షేర్', 'ఏష నాగుల' పాటలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులకు మరింత సమయం కేటాయించి చిత్రాన్ని సిద్ధం చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ పాన్‌ఇండియా చిత్రాన్ని సెప్టెంబర్ 24, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సినిమా విడుదలకు ముందే పాటకు లభిస్తున్న స్పందన అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతోంది. మరి ఈ మాస్ సాంగ్ క్రియేట్ చేసిన హైప్ సినిమా విడుదల తర్వాత ఎలాంటి ప్రభావం చూపిస్తుందో చూడాలి.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com